Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 06.04.2018, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 44 పేజీలు : 16, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



# చక్రబంధంలో చంద్రం

> విపక్షాల విమర్శలతో ఉక్కిరిబిక్కిరి > వెల్లువెత్తుతున్న అవినీతి ఆరోపణలు > వెంటాడుతున్న అక్రమాల భయం

మన ప్రత్యర్థి మీద అనవసరంగా బురద చల్లుతున్నప్పుడు, మన ప్రత్యర్థిని అక్రమ కేసుల్లో ఇరికించి కోర్టు మెట్లెక్కించినప్పుడు, అతనిపై అవినీతి ముద్రవేసి లక్ష కోట్లు తిన్నాడని అనుకూల మీడియాలో కథనాలు ప్రసారం చేయించినప్పుడు వచ్చే ఆ కిక్కే వేరప్పా... ఒకటా... రెండా దాదాపు ఆరేళ్ళ నుండి ఇలాంటి కిక్కునే అనుభవిస్తున్నాడు చంద్రబాబునాయుడు. ప్రతిపక్ష నేత జగన్‌పై ఎనిమిదేళ్లుగా బురదచల్లుతున్నాడు. తన వాళ్ళచేత చల్లిస్తున్నాడు. ఆ సీన్ చూసి పైశాచికానందం పొందుతూ వచ్చాడు. జగన్‌ను ఎన్ని రకాలుగా ఆడిపోసుకోవాలో ఆడిపోసుకున్నారు. ఇప్పుడు సీన్ రివర్స్ అవుతుందా? చంద్రబాబు చక్ర బంధంలో చిక్కుకోనున్నాడా? ఆయనను సమ స్యలు చుట్టుముడుతున్నాయా?

(మిగతా 11వ పేజీలో)

## అమరావతికి అప్పు ఆంధ్రోళ్ళకు ముప్పు

ఒక ఊరిలో చంద్రశేఖర్, రాజశేఖర్ అనే వ్యక్తులుండేవాళ్ళు. చంద్రశేఖర్‌కు ఆర్భాటం ఎక్కువ. ఇంట్లో అప్పులున్నా ఆడంబరాలకు కొదువ ఉండేది కాదు. రాజశేఖర్ మాత్రం ఉన్నంతలో జీవించాలనే స్వభావం వున్న మనిషి. తమ ఊరిలో కొత్తగా పెట్టిన ధమాల్ బ్యాంకు వాళ్ళు యువత స్వయం ఉపాధి కోసం ఋణాలిస్తున్నారని తెలిసి చంద్రశేఖర్, రాజ శేఖర్‌లిద్దరూ

(మిగతా 11వ పేజీలో)

## వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.. అను నేను...



ప్రభాకరయ్యతో ప్రమాణం చేయించిన వెంకయ్య 2లో



# వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.. అను నేను..

## ప్రభాకరయ్యతో ప్రమాణం చేయించిన వెంకయ్య



ప్రమాణస్వీకారం అనంతరం ఉపరాష్ట్రపతి మరియు రాజ్యసభ చైర్మెన్ యం.వెంకయ్యనాయుడుకు అభివాదం చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

**రాజకీయ ప్రయాణంలో ఆయన తొలి అడుగు పడింది. ఆ అడుగు ఇంకెన్ని వేల అడుగులు వేస్తుందో... ఇంకెన్ని వేల కిలో మీటర్ల దూరం ప్రయాణిస్తుందో... ఆ అడుగు ఎన్ని రాజకీయ మార్పులకు శ్రీకారం చుడుతుందో...**

నెల్లూరీయుడు, వదాన్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాజ్యసభ సభ్యుడిగా ఈ నెల 5వ తేదీ ఉదయం ప్రమాణస్వీకారం చేసారు. భారత ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మెన్ మరియు నెల్లూరీయులైన యం.వెంకయ్యనాయుడు సాటి నెల్లూరీయుడైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చేత ప్రమాణస్వీకారం చేయించారు. దీంతో ఆ క్షణం నుండి ప్రజాప్రతినిధిగా ఆయన ప్రయాణం మొదలైంది. రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన సాటి తెలుగోడు, నెల్లూరీయుడు విపిఆర్‌కు ఉపరాష్ట్రపతి వెంకయ్య అచ్చతెలుగులో శుభాకాంక్షలు తెలపడం విశేషం. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రమాణస్వీకారంతో రాజ్యసభలో వైకాపా సభ్యుల సంఖ్య రెండుకు చేరింది. వైకాపా తరపున ఢిల్లీ రాజకీయాలలో ప్రకంపనలు సృష్టిస్తున్న విజయసాయిరెడ్డికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తోడయ్యాడు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.... నెల్లూరీయులకు పరిచయం చేయాల్సిన అవసరం లేని పేరు. ఆంధ్రా ప్రజలకు బాగా పరిచయం ఉన్న పేరు. రేపటి నుండి దేశ వ్యాప్తంగా కూడా పరిచయం కానున్న పేరు.

ఇప్పటివరకు రాజకీయ నాయకుడిగా కంటే సేవాతత్పరుడిగా ఆయన ప్రజలకు సుపరిచితుడు. రాజకీయాలలోకి రాకముందు నుండే సేవారంగంలో వున్నాడు. సామాజిక, ఆధ్యాత్మిక రంగాలలో ఎన్నో సేవలందించారు. ఎన్నో మానవతా కార్యక్రమాలు నిర్వహిస్తూ గొప్ప మానవతావాదిగా ముద్రపడ్డారు. రెండు దశాబ్దాల క్రితం నెల్లూరుజిల్లాలో మాగుంట కుటుంబానికి గొప్ప పేరుండేది. వాళ్ళ సాయం పొందని కుటుంబం వుండేది కాదు. ఈ దశాబ్దంలో అంతటి గొప్పపేరు తెచ్చుకున్న వ్యక్తి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. పల్లెల గొంతు తడపడానికి మంచినీళ్ళిచ్చినా... పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించినా, భారీ ఎత్తున ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించినా, ఎన్నో అనాథ, వృద్ధాశ్రమాలకు చేయూతనిచ్చినా... అవన్నీ కూడా ఆయనలోని మానవత్వానికి నిదర్శనాలే! ఒక వ్యక్తిగా ఇంతకాలం ఆయన ప్రజలకు ఎంతో సేవచేసాడు. ఒక మంచి వ్యక్తికి ఈరోజు అధికారం అనే శక్తి తోడైంది. ప్రజలకు ఇంకా మంచే జరుగుతుంది. మంచితనం మూర్తీభవించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాజ్యసభలో అడుగుపెట్టిన శుభసందర్భంగా 'లాయర్' అభినందనలు.

# నారాయణను వదలని అనిల్



**మున్సిపల్ మంత్రి నారాయణకు ఎవరితోనూ సమస్యలు లేవు. ప్రతిపక్ష నాయకులు కూడా ఆయనపై పెద్దగా విమర్శలు చేయరు. కాని, నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ మాత్రం నారాయణకు చుక్కలు చూపిస్తున్నాడు. ఆయనకు కొరుకుడు పడని కొయ్యగా మారాడు.**

ఈ నాలుగేళ్ళలో మంత్రి నారాయణపై అనిల్ అవినీతి ఆరోపణలు చేసినంతగా ఇంకెవరూ చేసివుండరు. గతంలో పలు అంశాలలో మంత్రి నారాయణను ఏకిన అనిల్, తాజాగా వెంకటేశ్వరపురం యాష్‌పాండ్‌లో నిర్మిస్తున్న 'హౌస్ ఫర్ ఆల్' గృహ సముదాయాలపై పడ్డాడు. షేర్‌వాల్ టెక్నాలజీతో పేదల కోసం ఎంతో అందమైన ఇళ్ళు నిర్మిస్తున్నామని ఇంతకాలం నారాయణ గొప్పగా చెప్పుకుంటూ వచ్చాడు. ఈ ఇళ్లతో నగరంలో తన పాపులారిటీ పెరుగుతుందని నారాయణ భావించారు.

అయితే అనిల్ మాత్రం ఈ ఇళ్ళ నిర్మాణంలో భారీ అవినీతి చోటుచేసుకుందని చాలాకాలం నుండే విమర్శలు చేస్తున్నాడు. ఇక్కడ చదరపు అడుగు నిర్మాణానికి 1900 రూపాయలు అంటున్నారు. ఈమేరకు ప్రజల నుండి దండుకోవాలనుకుంటున్నారు. మాగుంట లే అవుట్, ఆదిత్యనగర్ లాంటి ఏరియాలోనే చదరపు అడుగు 2వేల రూపాయలలో అపార్ట్‌మెంట్ ఫ్లాట్లు అమ్ముతున్నారు. 'హౌస్ ఫర్ ఆల్' ఇళ్ళకు స్థలం ఫ్రీ, ఇసుక ఫ్రీ, కరెంట్ ఫ్రీ... ఇన్ని ఫ్రీ పెట్టుకుని చదరపు అడుగు 1900 రూపాయలేంటని, బయట ఏ బిల్డర్ అపార్ట్‌మెంట్ కట్టినా చదరపు అడుగు 1300 రూపాయలలో పూర్తి చేస్తారని, ఒక్కో ఇంటికి అడుగుకు 600 రూపాయలు మిగులుతాయని, ఇళ్ళ నిర్మాణం బాధ్యతను తనకు అప్పగించినా 1300 రూపాయలతో పూర్తి చేస్తానని అనిల్ వాదిస్తున్నాడు. తెలంగాణలో చదరపు అడుగు 1300 రూపాయలకే ఇస్తున్నారని, ఇక్కడ 1900 రూపాయలకు ఇస్తున్నారంటే ఎన్ని వందల కోట్ల దోపిడీ జరుగుతుందో అర్థం చేసుకోవాలంటున్నాడు. ఈ విషయంలో ఆయన కాంగ్రెస్, వామపక్షాల నాయకులను సైతం కలుపుకుని హౌస్ ఫర్ ఆల్ ఇళ్ళ నిర్మాణంలో అవినీతిపై ధ్వజమెత్తుతూ మంత్రి నారాయణపై దాడి చేస్తున్నాడు.

# అక్కడో మాట... ఇక్కడో పాట

## - వైసిపిపై ఎమ్మెల్సీ బీద ఆగ్రహం




ప్రత్యేకహోదా విషయంలో వైసిపి నాయకులు డబుల్ డ్రామా ఆడుతున్నారని, ప్రత్యేకహోదా ఇవ్వలేమని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటనల మీద ప్రకటనలు చేస్తున్నా ప్రధాని నరేంద్రమోడీపై తమకు నమ్మకం వుందంటూ వై.యస్.జగన్మోహన్ రెడ్డి, విజయసాయిరెడ్డిలు ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఆరోపించారు. 3వ తేదీ నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైకాపా నాయకులు మూడేళ్ళుగా ఎంపీల రాజీనామాలంటూ ప్రజలను మభ్యపెడుతూ ప్రత్యేకహోదా పోరాటాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు నిప్పులాంటి నాయకుడు, తెలుగుదేశం నిప్పు లాంటి పార్టీ. విధానాల పునాదులపై ఏర్పడ్డ పార్టీ. అవినీతి కేసుల్లో కూరుకుపోయి, కోర్టుల చుట్టూ పొర్లు దండాలు పెడుతున్న జగన్, విజయసాయిరెడ్డిలకు చంద్రబాబును, తెలుగుదేశంపార్టీలను వేలెత్తి చూపే అర్హత కూడా లేదు. వైయస్సార్ కాంగ్రెస్‌కు రోజులు దగ్గరపడ్డాయని, 2019 ఎన్నికలే ఆ పార్టీకి చివరి ఎన్నికలని బీద పేర్కొన్నాడు.

ఈ సమావేశంలో నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు ధర్మవరం సుబ్బారావు, బి.మనోహర్‌రెడ్డి, హరిబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.










# వైసిపి వైపు నేతల చూపు

**నవ్యాంధ్రలో శరవేగంగా చోటుచేసుకుంటున్న రాజకీయ మార్పు ప్రభావం నెల్లూరుజిల్లాపై కూడా ఎక్కువగానే కనిపిస్తోంది. ఇప్పటివరకు స్తబ్ధుగా వున్న జిల్లా రాజకీయం ఇప్పుడిప్పుడే ఊపందుకుని వేసవి తాపంతో పాటు వేడెక్కుతోంది.**



జిల్లాలోని పది నియోజకవర్గాలలో వైసిపికి ఇప్పటికే సమన్వయకర్తలున్నారు. వారే రేపు రాబోయే ఎన్నికల్లో అభ్యర్థులన్న ధీమాలో కూడా వున్నారు. అయితే ఇక్కడ తాము గెలవడం ముఖ్యమా, తమ లీడర్ ముఖ్యమంత్రి కావడం ముఖ్యమా అన్న ఆలోచన చేయగలిగితే వీరిలో చాలా మంది వెనక్కి వెళ్ళాల్సి వస్తుంది. తమ గెలుపే ప్రధానం అని స్వార్థంతో భావిస్తే వీళ్ళు పార్టీని చిక్కుల్లోకి నెట్టే పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికే జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ బాగా బలంగా వున్నప్పటికీ కొన్ని చోట్ల అభ్యర్థుల పట్ల అసంతృప్తి ఉందన్న వార్త బలంగా వినిపిస్తోంది. జిల్లాలో ఏ నియోజకవర్గమైనా టిక్కెట్టు పొందగలిగితే గెలుపు ఖాయం అన్న ధీమా కొత్త నేతల్లోనే కాదు, జిల్లా ప్రజల్లో కూడా వుంది. సిట్టింగ్‌ల పైన సహజంగానే కొంత అసంతృప్తి వుంటుంది కాబట్టి కొన్ని స్థానాల్లో అభ్యర్థులను మార్చక తప్పదని పి.కె. సర్వే చెబుతోందన్న వార్త కూడా షికారు చేస్తోంది. అయితే జిల్లా అంతటా ప్రస్తుతం వినిపిస్తున్న చర్చ పార్టీకి రానున్న కొత్త నేతలు ఎవరు...? వారి స్థానాలు ఏవి...?

ముందుగా నెల్లూరు పార్లమెంటు విషయానికొస్తే ఇక్కడ ఖచ్చితంగా కొత్త అభ్యర్థి అవసరం వుంది. మేకపాటి రాజమోహన్‌రెడ్డి పార్టీకి పెద్దదిక్కుగా, జగన్‌కి విధేయుడిగా మంచి మార్కులు సంపాదించుకున్నప్పటికీ ఎంపిగా జిల్లా ప్రజలు ఫెయిల్ మార్కులే వేస్తున్నారు. ఈ నేపథ్యంలో మాగుంట శ్రీనివాసులు రెడ్డి లేదా ఆదాల ప్రభాకర్‌రెడ్డిల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. అయితే గత ఎన్నికల్లో మేకపాటిపై పోటీ చేసి ఓడిపోయిన ఆదాలయితే గెలుపు ఖాయం అన్న అభిప్రాయం చాలామందిలో వున్నప్పటికీ ఆయన అసెంబ్లీకి వెళ్లాలన్న గట్టి పట్టుదలతో వున్నట్లు సమాచారం.

ఇక వెంకటగిరి విషయానికొస్తే ఇక్కడ కొమ్మి లక్ష్మయ్యనాయుడు పూర్తిగా రిటైర్ అయిపోవడంతో బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఈ సీటును కనిపెట్టుకుని పనిచేసుకుంటున్నాడు. జగన్ కూడా ఇప్పటికే హామీ ఇచ్చినట్లు చెప్తున్నా, ఇక్కడి నుండి మాజీముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కుమారుడు రాంకుమార్‌రెడ్డి పేరు బలంగా వినపడుతోంది. రాంకుమార్ అయితే వెంకటగిరితో పాటు గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో కూడా పార్టీకి మేలు జరిగే అవకాశాలు బలంగా వున్నాయన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా. మాజీముఖ్యమంత్రి కొడుకుగా నేదురుమల్లి వారసుడిగా జనం ఆయనకు జేజేలు పలుకుతారన్నది వీరి అభిప్రాయం. వెంకటగిరి నియోజకవర్గంలో బలమైన బంధువర్గం గల డిసిసిబి ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి కూడా రంగంలో ఉన్నట్లు తెలుస్తోంది. సీటిచ్చేటట్లైతే వైసిపిలో చేరడానికి ఆయన సిద్ధంగా ఉన్నాడని సమాచారం.

గూడూరు నియోజకవర్గానికి సంబంధించి మేరిగ మురళిని నిర్ణయించి గెలిపించే బాధ్యత గౌతంరెడ్డికి అప్పజెప్పినా మురళీరవం నియోజకవర్గంలో అంతగా వినిపించకపోవడంతో ఇక్కడ పనబాక కృష్ణయ్యని తెరపైకి తెచ్చే ఆలోచనలో మేధావులు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. అంగబలం అర్థబలం అన్నీ ఉన్న కృష్ణయ్య ఇక్కడ గట్టి అభ్యర్థి కావచ్చన్నది అంచనా.

ఇక్కడ ఇన్‌ఛార్జ్‌లుగా పార్టీ గెలుపుకోసం గట్టిగా పనిచేయాలనుకుంటున్న పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి, యల్లసిరి గోపాల్ రెడ్డికి, కోడూరు మీరయ్యకి ఈసారి ఎన్నిక పెద్ద సవాల్ కాబట్టి అభ్యర్థి విషయంలో వీళ్లు కూడా రాజీపడక పోవచ్చు.

ఇక ఆత్మకూరులో రామనారాయణరెడ్డి ఏ పార్టీ నుండి పోటీ చేసినా గెలుస్తాడని అక్కడ ఓటర్లు బాహాటంగానే చెప్తున్నారు. మంత్రిగా ఆయన చేసిన అభివృద్ధిని మరువలేకున్నామని, గత ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా నిలబడడం కారణంగా మన స్వాక్షిని చంపుకుని గౌతంరెడ్డికి ఓటేశామని అంటున్నారు. రామనారాయణరెడ్డి ఈసారి ఏ పార్టీ నుండి పోటీ చేసినా ఆయనకే ఓటేస్తామని ఒట్టేసి మరీ చెప్తున్నారు. ఈ క్రమంలో ఇక్కడ వైసిపి నుండి రామనారాయణరెడ్డి వస్తే ప్రభంజనంలా గెలిచే అవకాశాలు వున్నాయని అంటున్నారు. గౌతం లాంటి విధేయులు జగన్ మాట జవదాటే అవకాశం లేదు కాబట్టి, పార్టీ అధికారంలోకి వస్తే గౌతంని యంయల్‌సి చేసి ఆయనను మంత్రిని కూడా చేసే సాన్నిహిత్యం, సహచర్యం జగన్‌కి గౌతంకి మధ్య వుంది. కాబట్టి ఇక్కడి అభ్యర్థిని మార్చడం సులభమే.

కోవూరు విషయానికొస్తే ఇక్కడకూడా పార్టీ బలంగా వుండడమే కాకుండా ప్రసన్నకుమార్‌రెడ్డిపైన సానుభూతి కూడా వుంది. దీంతో సమానంగా పోలంరెడ్డిపైన అసంతృప్తి కూడా ఎక్కువగానే వుంది. అయితే... ఆఖరు నిముషంలో ఏదో విధంగా గెలుపు గుర్రంగా అవతారమెత్తే పోలంరెడ్డి ఆర్థికబలంతో ఈ సీటుకు ఎసరుపెట్టే ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. అయితే జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ప్రసన్న వైపే మొగ్గు చూపుతున్నట్లు వినికిడి.

సమీకరణలు మారి కొత్త నీరు పార్టీకి వస్తే ఉదయగిరి నుండి మేకపాటి రాజమోహన్‌రెడ్డి పోటీ చేస్తాడని కూడా వినిపిస్తోంది. ఇక్కడ శేఖర్‌రెడ్డి ఇమేజ్ బలంగా ఉన్నప్పటికీ అన్న కోసం త్యాగం చేసే పరిస్థితే వస్తే ఆయన బలికాక తప్పేటట్లు లేదు.

కావలిలో ప్రతాప్ జోరుగా ప్రచారం చేసుకుంటున్నప్పటికీ ఇక్కడ వంటేరు వేణుగోపాలరెడ్డి, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డిలు లైన్‌లో వున్నారు. అయితే వీరందరినీ ప్రక్కనబెట్టి కొత్త అభ్యర్థిని తెరపైకి తెస్తే వివాదం సద్దుమణుగుతుందని పార్టీ వర్గాలు భావిస్తున్న క్రమంలో ఇక్కడ కూడా ఆదాల పేరు వినిపిస్తోంది. అయితే జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో వుండడంతోనూ (మిగతా 11వ పేజీలో)




## 'ప్రభా'తం

# జీవించే హక్కు అందరిదీ!..

**ఎస్సీ ఎస్టీ వేధింపుల నిరోధక చట్టంలోని కొన్ని నిబంధనలను సడలిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దళిత సంఘాలకు ఆగ్రహం తెప్పించింది. ఆ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారంటూ, ఆ సంఘాలు ఆందోళనకు దిగాయి. అయితే, తామేమీ ఆ చట్టా న్ని నీరుగార్చలేదని, ఆ చట్టానికిగానీ, ఫిర్యాదు దారులకు గానీ తాము వ్యతిరేకం కాదని, నిర్దోషుల ప్రాథమిక హక్కులు పరిరక్షించేందుకు అదనపు రక్షణలు మాత్రమే జోడించామని, జీవించే హక్కుకు ఎవరూ దూరం కాకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.**

ఆలస్యం అమృతం విషం.. అన్నట్లుగా, ఒక్కోసారి నాన్చుడు ధోరణి వల్ల నానా అనర్ధాలు జరుగుతాయనేందుకు మొన్నటి భారత్‌బంద్ సందర్భంగా జరిగిన ఘర్షణలు..పలువురు మృతిచెందిన సంఘటనలు ప్రత్యక్ష సాక్ష్యాలు. ఈ సందర్భంగా కేంద్రం అనుసరిస్తున్న సాచివేత వైఖరి మరోసారి విమర్శలకు గురైంది. ఎస్సీ ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం దుర్వినియోగ మవుతున్నదన్న ఫిర్యాదులు రావడంతో సుప్రీంకోర్టు ఇటీవల కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది. దీంతో, ఆ చట్టం నీరుగారిపోతున్నదంటూ దేశంలోని దళిత సంఘాలు పెద్దఎత్తున ఆందోళనలు చేశాయి. ఆ తీర్పును సమీక్షించాలని కోరుతూ సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని ఆ సంఘాలు డిమాండ్ చేశాయి. అయితే, అప్పుడు కేంద్రం స్పందించలేదు. వారి విన్నపాలను పట్టించుకోలేదు. ఫలితంగా ఉత్తర భారతదేశంలో ఆగ్రహజ్వాలలు అంటుకున్నాయి. పలు రాష్ట్రాల్లో ఘర్షణలు జరిగాయి. ఆ తర్వాత..కేంద్రం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసింది. ఆ చేసేదేదో గత వారమే చేసివుంటే దేశంలో ఇంత ఆగ్రహజ్వాలలు పెల్లుబికేవి కాదు. సమస్యను వెంటనే పట్టించుకోక తాత్సారం చేసినందు వల్ల అలా ఘర్షణలు చెలరేగడమే కాక, పలువురు మృతిచెందే పరిస్థితి కూడా దాపురించింది. ఎస్సీఎస్టీల వేధింపుల నిరోధక చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను సహించేది లేదంటూ దళితసంఘాలు నిర్వహించిన బంద్ హింసాత్మకగా మారింది. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించి రాష్ట్రాలను అప్రమత్తం చేయాల్సిన కేంద్రం వైఫల్యం చెందిందనే అనవచ్చు. ఇక్కడ కూడా ప్రభుత్వం వెంటనే స్పందించక నాన్చుడు ధోరణి అవలంభించడం వల్ల పరిస్థితులు చేయిదాటిపోయాయి. తీరా, చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా తయారైంది పరిస్థితి. ఇదిలా వుంటే సమాజంలో కులం పేరిట నిరాదరణకు గురికావడం, వివక్షకు, వేధింపులకు, అత్యాచారాలకు గురువుతున్న వర్గాలకు బాసటగా నిలిచేందుకు 1989లో ఎస్సీఎస్టీ వేధింపుల నిరోధక చట్టం వచ్చింది. అయితే, ఆ చట్టంలోని కొన్ని కఠిన నిబంధనలను సడలిస్తూ గతనెల 20న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సంచల నాత్మకమైంది. ఈ చట్టం తరచుగా దుర్వినియోగానికి గురవుతోందని సుప్రీంకోర్టు అభిప్రాయ పడుతూ, తాజాగా ఆ చట్టంలోని కొన్ని కఠిన నిబంధనలు సవరిస్తూ కొన్ని ప్రత్యేక మార్గదర్శకాలను జారీచేసింది. అయితే, ఈ మార్గదర్శకాల వల్ల మొత్తం చట్టమే నీరుగారిపోయే ప్రమాదం ఉందని, ఇది చట్ట స్ఫూర్తికి విఘాతమని నిరసనలు వ్యక్తం చేస్తూ దళితసంఘాలు దేశవ్యాప్తంగా ఆందోళనకు దిగాయి. ఎస్సీఎస్టీ చట్టం కింద కేసు నమోదైతే తక్షణమే అరెస్టులు చేయాలని, అనంతరం జుడిషియల్ రిమాండ్‌కు పంపాలన్నది ఈ చట్టంలోని ఒక కీలక నిబంధన. అదేవిధంగా నిందితులు ముందస్తు జామీను పొందే ఆస్కారం ఉండదు. అయితే, ఈ చట్టం తరచుగా దుర్వినియోగమవుతోందని, వ్యక్తిగత కక్షలు తీర్చుకునేందుకు, స్వప్రయోజనాలను పరిరక్షించుకునేందుకు ఈ చట్టాన్ని దుర్వినియోగపరుస్తున్నారని, కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు, తరచూ అమాయకులను కేసుల్లో ఇరికిస్తూ ఈ చట్టం కింద కేసులు పెడుతుండడం కూడా జరుగుతోందని న్యాయస్థానం అభిప్రాయపడింది. అమాయకులను నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొనేలా చేయడం ఈ చట్టం ఉద్దేశం కాదని స్పష్టం చేసింది. కేసులు నమోదైనప్పుడు సంబంధిత జిల్లా సీనియర్ పోలీస్ సూపరింటెండెంట్ అనుమతించిన తర్వాతే అరెస్ట్ చేయాలని సూచించింది. ఆరోపణలు దురుద్దేశంతోగానీ, మరేదైనా కారణంతో గానీ చేసినవని ప్రాథమిక దర్యాప్తులో తేలిన పక్షంలో..ముందస్తు జామీను ఇవ్వకూడదన్న ఆంక్షలు వర్తించవని స్పష్టం చేసింది. అయితే, సుప్రీంకోర్టు ఇచ్చిన ఇలాంటి తాజా మార్గదర్శకాలు చట్టాన్ని నిర్వీర్యం చేసేవిగానే ఉన్నాయంటూ పలు రాజకీయపక్షాలు, దళితసంఘాలు ఆందోళన బాటపట్టాయి. ఆ తర్వాత కేంద్రం రంగంలోకి వచ్చి ఆ తీర్పును మరోసారి సమీక్షించుకోవాలని సుప్రీంకోర్టులో సమీక్షా పిటిషన్ దాఖలు చేసింది. అయితే, తామేమీ ఎస్సీ ఎస్టీ చట్టాన్ని నీరుగార్చలేదని, సుప్రీంకోర్టు తాజాగా మళ్ళీ స్పష్టం చేస్తూ, గత నెల 20న తామిచ్చిన తీర్పును తాత్కాలికంగా నిలిపివేయడానికి నిరాకరించింది. బాధితులకు పరిహారం చెల్లించడానికి, వారికి ఆశ్రయం కల్పించడానికి, ఎఫ్ఐఆర్ నమోదుకు దోషులకు శిక్షలు అమలు చేయడానికి తమ ఆదేశాలు ఆటంకం కానేకాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. చట్టంలోని ఏ నిబంధననూ తాము నీరుగార్చలేదని, నిర్దోషుల ప్రాథమిక హక్కులను పరిరక్షించేందుకు అదనపు రక్షణలను మాత్రమే జోడించామని పేర్కొంది. అంతేకాదు, సవరణలు వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేపడుతున్న వారు బహుశా తమ తీర్పును సరిగా చదివి ఉండక పోవచ్చుని కూడా వ్యాఖ్యానించింది. అయితే, తీర్పుపై పునరాలోచించాలని కోరుతూ కేంద్రప్రభుత్వం దాఖలు చేసిన సమీక్షా పిటిషన్‌ను పదిరోజుల తర్వాత సమగ్రంగా పరిశీలిస్తామని వెల్లడించింది.

"నిర్దోషులకు శిక్ష పడకూడదని మేం చెప్పాం.. ఎస్సీ ఎస్టీ చట్టంలోని నిబంధనలతో వారు భయభ్రాంతులకు గురికాకూడదు. జీవించే హక్కుకు ఎవరూ దూరం కావొద్దన్నదే మా అభిమతం. ఇక్కడ ఒక్కటి మాత్రం స్పష్టంగా చెప్తున్నాం. ఎస్సీ ఎస్టీ చట్టానికి గానీ, ఫిర్యాదుదారులకు గానీ మేం వ్యతిరేకం కాదు".. అని సర్వోన్నత న్యాయస్థానం ఏర్పాటుచేసిన ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఈ సందర్భంగా స్పష్టం చేయడం గమనార్హం.

ఏదేమైనా దళితులకు.. ఎస్టీలకు.. బడుగు బలహీనవర్గాల ప్రజలకు చట్టాలు, ప్రభుత్వాలు తప్పనిసరిగా అన్నివిధాల రక్షణ ఇవ్వాల్సిందే. వారిపై వేధింపులకు, అన్యాయాలకు, అఘాయిత్యాలకు పాల్పడే దోషులు ఎంతటివారైనాసరే..వారిని కఠినంగా శిక్షించాల్సిందే. ఇందులో ఎవరికీ ఎలాంటి ఆక్షేపణా ఉండనక్కరలేదు. అయితే, ఏ నిరపరాధి కూడా ఎలాంటి అన్యాయానికీ గురికాకూడదు. వందమంది దోషుల్లో ఒక్క నిర్దోషి ఉన్నా.. ఆ ఒక్కరినీ రక్షించుకోవడం న్యాయం. అదే ధర్మం.. అదే మానవత్వం కూడా!..

## శబరి శ్రీరామక్షేత్రంలో.. నేత్రపర్వంగా వసంతోత్సవం



అశ్వవాహనంపై స్వామివారు

నెల్లూరు దర్గామిట్టలో ఉన్న శబరి శ్రీరామక్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 2న స్వామివారికి వసంతోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఉత్సవ మూర్తులను శోభాయమానంగా అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. భక్తులు వసంతాలు చల్లుకుంటూ ఎంతో ఉత్సాహంగా ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పసుపులేటి మహి, బాబు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్ల వేడుకలను తిలకించి తరించారు. అనంతరం రాత్రి, న్యూమిలిటరీ కాలనీలోని మునిసిపల్ పార్కులో పారువేట ఉత్సవం నిర్వహించారు. ఆ తర్వాత అశ్వవాహనంపై స్వామివార్లను ఊరేగిస్తూ నగరోత్సవం నిర్వహించారు. ఈ వేడుకలకు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, జ్యోతి కుటుంబసభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా హరివిల్లు క్రియేషన్స్ దోర్నాల హరిబాబు ఆధ్వర్యంలో జరిగిన 'నవ్వుల హరివిల్లు' సాంస్కృతిక కార్యక్రమాలు, ఇంద్రజాల ప్రదర్శన అందరినీ అలరించాయి.

## 8న జిఆర్ ట్రస్ట్ పురస్కారాలు

గత పదకొండేళ్ళుగా నెల్లూరులోని జిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గుర్రాల రమణమ్మ స్మారక సాహిత్య పురస్కారాల సభ ఈనెల 8న స్థానిక ఐఎంఏ హాల్‌లో జరుగుతుందని ప్రముఖ కవి, జిఆర్ ట్రస్ట్ అధ్యక్షుడు గుర్రాల రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సభలో పలువురు ప్రముఖ సాహితీవేత్తలు పాల్గొంటారన్నారు. ప్రముఖ కవి రావి రంగారావు, ఎక్స్‌రే పత్రిక సంపాదకుడు కొల్లూరి, సైకియాట్రి ప్రొఫెసర్ డాక్టర్ వివి శేషమ్మ, ఆచార్య ఆదిత్య, శ్రీమతి యలమర్తి అనూరాధ, పి.శ్రీనివాసగౌడ్, కలిమిశ్రీ, ద్వారం వేణుగోపాలరెడ్డి, ప్రముఖ కవయిత్రి శ్రీమతి పోపూరి మాధవీలతలకు పురస్కారాలను ప్రదానం చేయనున్నామన్నారు. సాహితీప్రియులందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

నెల్లూరులోని సంతపేట నాలుగుకాళ్ళ మండపం కూడలిలో విహెచ్‌పి, భజరంగదళ్ ఆధ్వర్యంలో ఈ నెల 2న మజ్జిగ చలివేంద్రం ప్రారంభమైంది. ఈ చలివేంద్రం ప్రారంభోత్సవంలో విహెచ్‌పి నాయకుడు మెంటా రామ్మోహన్ రావు, మాజీ కార్పొరేటర్ కప్పిర శ్రీనివాసులు, శ్రీ రంగనాథస్వామివారి భక్తులు పాల్గొన్నారు.

## సిమెంటు బెంచీలు వితరణ

కోవూరు సమీపంలోని ఇనమడుగు గ్రామానికి చెందిన అనూరాధ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు గండవరపు వసంతకుమార్‌రెడ్డి పాటూరురోడ్డులో ఉన్న 'స్వర్గధామం'కు 6 సిమెంట్ బెంచీలను వితరణగా ఏర్పాటు చేశారు.




## ఇచ్చిన విరాళాలు ఏమయ్యాయి?

అమరావతి రాజధాని పేరుతో కేంద్రం ఇచ్చిన నిధులన్నింటిని దుర్వినియోగం చేసారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులను దుబారా చేసారు. అమరావతి రాజధాని నిర్మాణానికి అప్పులివ్వండంటూ ప్రజలను దేబిరిస్తున్నారు. ప్రభుత్వానికి ప్రజలు అప్పులిచ్చే స్థితిలో వున్నారా? చంద్రబాబు చెప్పిన అప్పే మాఫీ కాక ఊగిసలాడుతున్నారు. చంద్రబాబుకు అప్పులిచ్చే పొజిషన్‌లో వుండేది ఆయన మంత్రివర్గ సహచరులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలే! ఈ నాలుగేళ్ళలో బాగా సంపాదించారు. వాళ్ళు సంపాదించిన దాంట్లో నాలుగోవంతు ఇచ్చినా చంద్రబాబు గారి కలల రాజధానిని కంప్లీట్ చేయవచ్చు. గతంలో రాజధాని అంటూ సేకరించిన నిధులను ఏం చేసారో లెక్కలేదు. అయినా అప్పులు చేసి గొప్ప రాజధానిని కట్టాలన్న ఐడియా చంద్రబాబుకెందుకొచ్చిందో!

**షేక్ మీరావలి, ఆత్మకూరు.**

## హిందూ వ్యతిరేక శక్తులు

జాతీయ రాజకీయాలలో హిందూ వ్యతిరేక శక్తులు, జాతీయ విచ్ఛిన్న శక్తులు మళ్ళీ చేతులు కలుపుతున్నాయి. హిందువుల మీద మతోన్మాదం ముద్రవేసి ఓటు బ్యాంకు రాజకీయాలకు ఈ పార్టీలు బాటలు వేస్తున్నాయి. హిందువులకు కాంగ్రెస్ బద్ధ వ్యతిరేకి. ఈ దేశంలో హిందువులు అన్యాయం కావడానికి ఆ పార్టీ అవలంబిస్తున్న కుహనా లౌకికవాద ధోరణే కారణం. అలాగే తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి హిందువులకు బద్ధశత్రువుగా మారుతోంది. పశ్చిమబెంగాల్‌లో హిందువులపై మతోన్మాదశక్తులు దాడులకు పాల్పడుతున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. అలాగే వామపక్షాలు, బిఎస్పీ, ఆర్జేడీ వంటి పార్టీలు హిందూ వ్యతిరేక వైఖరితో వుంటాయి. హిందువులు కలసికట్టుగా వుండి ఈ పార్టీలను ఓడించాలి.

**సి.రాజీవి, నెల్లూరు.**

## ప్రజలకు చేరువకాని కేంద్ర పథకాలు

కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మంచి పనులేవీ ప్రజలకు తెలియడం లేదు. ప్రతి పేదవాడికి ఇల్లు అన్నది కేంద్రం స్కీం. కాని, మన రాష్ట్రంలో ప్రచారం తీరు చూస్తే చంద్రబాబు ఆస్తులు అమ్మి పేదలకు ఇళ్ళు కడుతున్నట్లుగా వుంది. ఇటువంటిదే చంద్రన్న బీమా కూడా! ఇది కూడా కేంద్రం స్కీమే. ఇలా కేంద్రం చాలా పథకాలు అమలు చేస్తున్నప్పటికీ వాటిని ఎవరూ కేంద్ర పథకాలు అనుకోవడం లేదు. నోట్ల రద్దు, జిఎస్టీ వంటివి మాత్రం కేంద్రం చేసిన నిర్వాకాలుగా ప్రజల్లో మోడీపై వ్యతిరేకతను పెంచేలా చేశాయి.

**– సి.భావన, నెల్లూరు.**

# పేద ప్రజల దాహార్తి తీర్చే 'విపిఆర్ అమృతధార'

- కోట్లాది రూపాయలు వెచ్చించి గ్రామాల్లో మినరల్ వాటర్‌ప్లాంట్‌లు
- పల్లెపల్లెనా వేమిరెడ్డికి జననీరాజనం

**ఎంతోమందికి బోలెడు ధనం ఉంటుంది కానీ కాస్తంత వితరణ గుణం ఉండదు. తమకున్న ధనంలో కొంతభాగాన్నయినా పేదప్రజల కోసం వెచ్చించి వారి బాగోగులను పట్టించుకోవాలనే ధ్యాస చాలా మందికి ఉండదు. మరికొంత మందికి వితరణ గుణం ఉన్నా పదిమందినీ ఆదుకోవడానికి తమవద్ద చాలినంత ధనం ఉండదు. అయితే, ధనంతో పాటు వితరణ గుణం కలగలిసిన మానవతా మూర్తి.. మహాదాత, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మన జిల్లావాసి కావడం మన అదృష్టం.**



వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి హారతులు పడుతూ స్వాగతిస్తున్న మహిళలు





యువతకు క్రికెట్ కిట్స్ పంపిణీ చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

జిల్లాలో వేలాదిమంది నిరుపేదలకు, వికలాంగులకు, బడుగు బలహీనవర్గాల ప్రజలకు ఆయనో ఆపన్నహస్తం. ఆపదల్లో ఉన్నవారిని ఆదుకోవాలనే మంచి మనస్తత్వం.. సమాజానికి తనవంతు సేవ చేయాలనే మానవీయ తత్వంతో విపిఆర్ జిల్లాలో అనేక ప్రజాసంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే సదాశయంతో విపిఆర్ విద్య, పేదలకు ఉచిత వైద్యం అందించాలనే సంకల్పంతో విపిఆర్ వైద్యం వంటి కార్యక్రమాలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు, సామాజిక సేవలకు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు నేనున్నానంటూ చేయందిస్తూ ఆయన చేస్తున్న సేవలు అపారం.. అమోఘం. ఎంతోకాలం నుంచి ప్రజాసేవలో తరిస్తూ, ప్రజల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్న వేమిరెడ్డి ఇటీవలికాలంలో విపిఆర్ వికాస్ పేర గ్రామీణ వికాసమే లక్ష్యంగా ప్రారంభించిన 'విపిఆర్ అమృతధార' పథకం ఆయన మానవీయ హృదయానికి దర్పణం. విపిఆర్ వితరణ గుణానికి నిదర్శనం. 9 విడతలు పూర్తయిన 'విపిఆర్ అమృతధార' పథకం ఎంతో మంది ప్రజల ప్రాణాలను నిలబెడుతూ ఉంది. నీటి వనరులు లేని అనేక గ్రామాలకు ఇది వరంగా మారింది. ఇటీవల 10వ విడతగా పలు గ్రామాల్లో ఈ పథకం కింద మినరల్ వాటర్‌ప్లాంట్‌లు విపిఆర్ సువర్ణహస్తాల మీదుగా ప్రారంభం కావడం ఆయా ప్రాంతాల ప్రజల్లో ఎంతో సంతోషం నింపింది.

### ఆరు గ్రామాలకు శుద్ధి చేసిన నీరు:

జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో ఉన్న అనేక గ్రామాల్లో ప్రజలు ఎంతోకాలం నుంచి గుక్క తడుపుకోను గుక్కెడు నీటి కోసం ఎన్నో అవస్తలు పడుతున్నారు. అందులోనూ ఈ ఎండాకాలంలో మంచి నీటికి ప్రజలు పడే అవస్తలు వర్ణనాతీతం. అనేక గ్రామాల్లో మంచినీటి వనరులు మృగ్యమైపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని అనేకమంది పేదలు విధిలేని పరిస్థితుల్లో ఫ్లోరిన్ శాతం అధికంగా ఉన్న నీటిని తాగాల్సివస్తోంది. దీంతో ఎంతోమంది రకరకాల వ్యాధులకు బాధలకు గురవుతుండడం జరుగుతూనే ఉంది. ఫ్లోరిన్ నీటిని తాగడం వల్ల కాళ్ళు వంకర్లు పోవడం, ఎదుగుదల సక్రమంగా లేకపోవడం, రకరకాల వ్యాధులు చుట్టుముట్టడం వంటి రుగ్మతలతో ఫ్లోరిన్ బాధితుల పరిస్థితి దయనీయంగా ఉంటోంది. ఇప్పటికే అనేక మంది రకరకాల వ్యాధులకు గురై జీవచ్ఛవాలుగా బతుకులీడుస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో గ్రామీణప్రాంతాల్లోని పేద ప్రజలు పరిశుభ్రమైన మంచినీరు దొరక్క పడే బాధలను, ఇతర అసమానతలతో పడే వేదనలను దృష్టిలో పెట్టుకుని ఆ బాధల నుంచి వారికి విముక్తి కలిగించేందుకు నేనున్నానంటూ ప్రముఖదాత, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి (విపిఆర్) మానవతా దృక్పథంతో ప్రజలకు పరిశుద్ధమైన (మిగతా 15వ పేజీలో)


స్వార్థం లేని సేవకుడు
కల్మషమెరుగని నాయకుడు
నిత్య భగవత్ ఆరాధకుడు
నిరంతర ప్రగతి సాధకుడు
**వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గారు**
రాజ్యసభ సభ్యులుగా ఎంపికై
ప్రమాణస్వీకారం చేసిన శుభవేళ
**ఆత్మీయాభినందనలు.**

ఆయన ఇంకా ఎన్నో పదవులు
అలంకరించాలని అభిలషిస్తూ...



Sk. Hanif

**ఆత్మీయ అభినందనలు**



BERACHAH
ENGINEERING WORKS
Plot No.118, Phase I & II
Auto Nagar, Guntur.
Cell: 98492 29577

- కాంట్రాక్టర్లు, అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట

# ఉసూరుమంటున్న ఊపిరితిత్తులు

➤ ఆసుపత్రుల నిండా నెల్లూరోళ్ళే... అంతా 'లంగ్ ఇన్‌ఫెక్షన్' రోగులే!




*ఈ నిర్లక్ష్యానికి బాధ్యత ఎవరిది?..ఈ దౌర్భాగ్యానికి కారకులెవరు?..నెల్లూరు నగరాన్ని ఊపిరితిత్తుల జబ్బు పీడిస్తున్నా, దుమ్మురోడ్లతో జనం నిత్యం వ్యాధుల బారిన పడి భస్తున్నా అటు కార్పొరేషన్‌వారికిగానీ, ప్రజారోగ్య అధికారులకు గానీ, సంబంధిత కాంట్రాక్టర్లు..వారి సిబ్బందికి గానీ, వీటినన్నిటినీ ఏసీగదుల్లో కూర్చొని పర్యవేక్షిస్తున్న మంత్రులకు గానీ, నాయకులకు గానీ కనీసం దోమకుట్టినట్లు కూడా లేకపోవడం నెల్లూరు ప్రజల దౌర్భాగ్యమనే అందామా?...నెల్లూరు జనం ఎప్పుడు చేసుకున్న పాప ఖర్మో అని సరిపెట్టుకుందామా?..*

దుమ్ము... ధూళి అనేవి ప్రకృతిసిద్ధంగా వస్తుంటాయి. అవి ఎప్పుడో గాలి వీస్తేనో లేదా, పెనుగాలి రేగితోనో దుమ్ము పెద్దఎత్తున పైకిలేస్తుంది. కానీ, అది కొద్దిసేపే. ఇంతలో ఏ చిన్న వానజల్లు కురిస్తే చాలు.. ఆ దుమ్మంతా మాయమైపోతుంటుంది. అయితే, నెల్లూర్లో అలా కాదు. ఇక్కడ దుమ్ము ప్రత్యేకించి తయారయ్యింది. భూగర్భడ్రైనేజీ కోసం రోడ్లన్నీ తవ్వి, అక్కడక్కడా గుంతలు వదిలేయడం, రోడ్లపై క్వారీ డస్ట్‌ను పోసి దుమ్ముధూళితో నగరవాసులు రకరకాల వ్యాధుల బారిన పడుతున్నా రోజుల తరబడి పట్టించుకోకపోవడం ఏమిటని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుమ్ము ప్రతిరోజూ ప్రజలకి నరకాన్ని చూపిస్తోంది. నోళ్ళకి, ముక్కులకి గుడ్డలు చుట్టుకున్నా లాభం లేదు. ఎంతసేపని అలా ఉండగలం?.. ఒక్క నిమిషం ఏమారితే చాలు, ఆ దుమ్మంతా ఊపిరితిత్తుల్లోకి చేరిపోతుంది. దీంతో ఇక ఊపిరి తీయలేక జనం పడే అవస్తలు వర్ణనాతీతం. అయినా, అధికారులు కానీ, సంబంధిత కాంట్రాక్టర్లు కానీ ఇవేమీ పట్టించుకోరు. ఎంత దుమ్ము.. ఎంత కాలుష్యం నగరాన్ని చుట్టుముట్టేసి జనాన్ని ఆసుపత్రులు పాలుచేస్తున్నా ఎవరికీ ఏమీ పట్టదు. అమాయకపు జనం ఉంటేనేం.. పోతేనేం అన్నట్లుంటారు మన నాయకులు. ఎన్నిసార్లు ఈ బాధలు పేజీలకు పేజీలు రాసినా ఎవరికీ దోమ కుట్టినట్లు కూడా ఉండదు. అధికారులు, కాంట్రాక్టర్లు, నాయకులు అంతా ఏసీ కార్లలో తలుపులు మూసుకుని హాయిగా, చల్లగా తిరుగుతుంటారు కనుక బయట జనం పడే అవస్తలు వారికి నల్ల అద్దాల్లోంచి కనపడవు. ఈ దుమ్ము, ధూళి ప్రజల ఆరోగ్యాలనెంత కలుషితం చేస్తోందో, చిన్నపిల్లలు, పెద్దలు, వృద్ధులు, గృహిణులు ఎంతమంది ఆ దుమ్ము వల్ల శ్వాసకోశ వ్యాధులకు గురై నెత్తీనోరు బాదుకుంటూ ఆసుపత్రుల్లో పడి అల్లాడుతున్నారో వారికి తెలియదు. తెలిసినా తెలియనట్లుండడమే వారి నైజం. మంచిరోడ్లు వేస్తారని జనం ఎంతో ఆశపడి సహకరిస్తున్నా, రోజులు గడిచిపోతూనే ఉన్నా, జనాన్ని దుమ్ములో వేయిస్తున్నారే తప్ప, ఈ దుమ్మురోడ్లను బాగుచేయకపోవడం ఏమిటని నగరప్రజలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. రోజంతా ఆ దుమ్మే పీలుస్తుండడంతో ఊపిరితిత్తులు ఊపిరి పీల్చలేక దస్సిపోతున్నాయని వృద్ధులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి బాధలతో ఎంతోమంది ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. కానీ జిల్లా ఉన్నతాధికారులు కానీ, కార్పొరేషన్ అధికారులు, నాయకులు కానీ పట్టించుకోవడం లేదు. రోడ్లమీద క్వారీడస్ట్‌ను తాత్కాలికంగా వేసి, ఆ తర్వాత మంచిరోడ్లు వేస్తారేమోనని జనం ఉగ్గబట్టి ఎదురుచూస్తూనే ఉన్నారు. కానీ, అలాంటి ఛాయలేమీ కనిపించడం లేదు. సరికదా, దుమ్ము రోడ్లపై దుమ్ము లేవకుండా నిర్ణీతసమయాల్లో నీరు చల్లడం వంటి కనీస కంటితుడుపు చర్యలు కూడా నామమాత్రంగానే చేపడుతున్నారు. దీంతో, ఆ రోడ్ల పక్కనే ఉన్న ఇళ్ళు, షాపుల్లో దుమ్ము పేరుకుపోతోంది. వంటినిండా దుమ్ము..ఇంటినిండా దుమ్మే అన్నట్లుగా ఈ దుమ్ముతో రోజూ చస్తున్నా కార్పొరేషన్ వాళ్ళు కార్లల్లో ఇదే దారిన వెళ్తూ చోద్యం చూస్తున్నారే తప్ప సత్వర చర్యలు తీసుకునేందుకు చొరవ చూపడం లేదని జనం తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఒకవేళ ఈ బాధలు తాత్కాలికమే అనుకున్నా, ఎన్నిరోజులు ఇలా గడపాలో తెలియడం లేదని, ఈలోగా ఊపిరితిత్తులు కాస్తా పాడైపోతే పరిస్థితి ఏమిటని జనం ఆవేదన.

నగరంలోని ప్రధానరోడ్లలో ఒకటైన మాగుంట లే-అవుట్ రోడ్డు, మినీబైపాస్ రోడ్డు, పొదలకూరు రోడ్డు, ఏసినగర్, బాలాజీనగర్, దర్గామిట్ట ఇలా కనీసం ప్రధాన రోడ్లనైనా అధికారులు ఒక బృందంగా ఏర్పడి వెంటనే పరిశీలించి, ఎక్కడ వాటిని బాగు చేయాలో తక్షణ చర్యలు తీసుకుంటే తప్ప ఈ దుస్థితి మారదని ప్రజలు సూచిస్తున్నారు. దుమ్మురోడ్లను వెంటనే బాగుచేసి, త్వరగా మంచిరోడ్లు వేయాలని, కార్పొరేషన్ అధికారులకు, సంబంధిత నాయకులకు ఇకనైనా అలాంటి మంచిబుద్ధి కలిగించాలని నగర ప్రజలు నిత్యం వేయిదేవుళ్ళకు మొక్కుకుంటున్నారు.

# నాలుగేళ్ళు నిద్రపోయావా?

## - చంద్రబాబుపై ప్రసన్న మండిపాటు



ప్రత్యేకహోదా కోసం వైకాపా అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి అలుపెరుగని పోరాటం చేస్తుంటే, చంద్రబాబు మాత్రం ఇప్పుడొచ్చి కొత్త నాటకాలాడుతున్నాడని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆరోపించాడు. 3వ తేదీ కోవూరులోని ఆర్ అండ్ బి అతిథిగృహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఇప్పుడు హోదా గురించి మాట్లాడుతున్నాడని, ఈ నాలుగేళ్ళ నుండి నిద్రపోయారా? అని ప్రశ్నించాడు. చంద్రబాబు ఎన్నికలకు ముందు ప్రత్యేకహోదా అన్నాడు. అధికారంలోకి వచ్చాక తనకు ప్రత్యేక ప్యాకేజీ చాలన్నాడు. జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక ఉద్యమాన్ని పార్లమెంటు దాకా తీసుకెళ్ళేసరికి మళ్ళీ యూటర్న్ తీసుకుని ప్రత్యేక హోదా అంటున్నాడు. తమను ప్రజలు ఎక్కడ ఛీకొడతారోననే భయంతోనే కొత్త డ్రామాకు తెరలేపాడు. నిన్నటిదాకా బీజేపీతో కాపురం చేసాడు. ఇప్పుడు ఇతర పార్టీలను కలుపుకుని బీజేపీ మీద దండయాత్ర చేస్తానంటున్నాడు. ఇంత మాయలమరాఠీని ఎప్పుడూ చూడలేదు. చంద్రబాబుకు పిచ్చి బాగా ముదిరింది. ఆయన్ను వెంటనే ఆసుపత్రికి తీసుకుపోవడం మంచిదని ప్రసన్న హితవు చెప్పాడు. చిత్తశుద్ధి వుంటే చంద్రబాబు తన ఎంపీల చేత రాజీనామా చేయించి ప్రత్యేకహోదా ఉద్యమంలో కలిసి రావాలన్నారు. ప్రత్యేకహోదా పోరులో భాగంగా ఈ నెల 6న వైకాపా లోక్‌సభ సభ్యులు రాజీనామా చేస్తారని, వారికి సంఘీభావంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో, నియోజకవర్గాల్లో రిలే నిరాహారదీక్షలు జరుగుతాయని, కోవూరులోని ఎన్‌జిఓ హోం వద్ద నియోజకవర్గంలోని వైకాపా నాయకులు దీక్షలో కూర్చుంటారని ఆయన వెల్లడించాడు.

## వేసవి సెలవులు...

# వినోదం కావాలే గాని విషాదం కాదు



వేసవి సెలవులు వచ్చేస్తున్నాయి. ఇప్పటికే టెన్త్, ఇంటర్ పరీక్షలు ముగిసాయి. వీళ్ళతో పెద్ద సమస్య లేదు. టెన్త్ వ్రాసిన వాళ్ళు ఇంటర్మీడియట్‌కు, ఇంటర్ వ్రాసిన వాళ్ళు ఎంసెట్‌కు ప్రిపేరవడంతోనే సెలవులు దాటిపోతాయి. లోయర్ క్లాస్‌లకు ఈ నెలాఖరు నుండే సెలవులు. వేసవి సెలవుల్లో మనం తరచూ పత్రికల్లోనూ, టీవీల్లోనూ చూస్తుంటాం... 'చెరువులో ఈతకు వెళ్ళి విద్యార్థుల దుర్మరణం' అని. ప్రతి వేసవి సెలవుల్లోనూ ఇలాంటి సంఘటనలు ఒకటి అరా చోటు చేసుకుంటూనే వుంటాయి.

చెరువుల్లో నీళ్లు వుంటే కదా పిల్లలు ఈత కొట్టడానికి అనే అనుమానం కూడా రావచ్చు. నిజమే... గత ఏడాది వర్షాలు లేవు. చెరువులు నిండలేదు. కాని చెరువుల్లోని గుంటల్లో వున్న నీళ్ళే ప్రమాదకరం. జిల్లాలోని అన్ని చెరువుల్లో అక్రమంగా మట్టి, గ్రావెల్ తవ్వకాలు జరిగివున్నాయి. పెద్దపెద్ద గుంటలు ఏర్పడ్డాయి. వర్షాలపుడు ఈ గుంటల్లోనే నీళ్ళు నిలిచిపోతున్నాయి. ఈ గుంతలు ఎంత లోతుంటాయో తెలియదు. వేసవి సెలవులలో ఇళ్ళ దగ్గర వున్న పిల్లలు స్నేహితులతో సరదాగా ఈతకని వెళ్లి ఈ గుంటల్లో దిగి ప్రాణాలు కోల్పోతున్నారు. కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలపై ఓ కన్నేసి వుంచడం మంచిది. దుర్ఘటనలు జరిగిపోయాక ఏడ్చి లాభం వుండదు.

# ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి




రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వాలంటూ ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్‌యుఐ నాయకుల ఆధ్వర్యంలో తొలుత ర్యాలీ జరిగింది. విఆర్‌సి సెంటర్ నుంచి కలెక్టరేట్ దాకా ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులకు, విద్యార్థినాయకులకు మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి వీరవల్లభ్ మాట్లాడుతూ, అవిశ్వాసంపై పార్లమెంట్‌లో చర్చించాలన్నారు. ఏపికి ప్రత్యేకహోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ ఆందోళనలో ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు కేశవనారాయణ, నాయకులు ముమిత్‌షా, మహేష్, నవీన్, అంబేద్కర్, మధు, కౌషిక్, శిరీష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు ఎస్.ఐ సస్పెండ్

పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆత్మకూరు ఎస్.ఐ ఖాజీబాబును సస్పెండ్ చేస్తూ గుంటూరు రేంజ్ ఐ.జి. కె.వి.గోపాలరావు 4వ తేదీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆత్మకూరు ఎస్.ఐగా వచ్చినప్పటి నుండి ఖాజీబాబుపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. నిందితుల నుండి మామూళ్ళు వసూలు చేస్తూ కేసులు నీరుగారుస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ ఆరోపణల నేపథ్యంలోనే మార్చి 19న ఆయనను విఆర్‌కు ఆదేశిస్తూ ఎస్పీ రామకృష్ణ ఉత్తర్వులు జారీ చేసారు. ఆయనపై విచారణ జరిపి ఆరోపణలన్నీ వాస్తవమేనని తేల్చి ఐ.జి.కి నివేదిక సమర్పించారు. దీని ప్రకారం ఖాజీబాబును సస్పెండ్ చేస్తూ ఐ.జి ఉత్తర్వులు జారీ చేశారు.

# జాతీయస్థాయి హాకీకి ఎంపికైన విద్యార్థి

ఈ నెల 21 నుంచి మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగే జాతీయస్థాయి జూనియర్ హాకీ చాంపియన్‌షిప్ పోటీలకు నెల్లూరు వెంకటేశ్వరపురం ఐటిఐ కళాశాల విద్యార్థి పోలు ఆదినారాయణ ఎంపికయ్యాడని కళాశాల ప్రిన్సిపల్ షేక్ రజియా తెలిపారు. బుధవారం కళాశాలలో ఆదినారాయణను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.



# ఆదాల ఏ పార్టీ ఆటగాడో?

**ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో కొన్ని సెంటిమెంట్లున్నాయి. దేవాదాయశాఖ మంత్రిగా పనిచేసినోళ్ళు తర్వాత ఎన్నికల్లో గెలవరని. ఎన్నికలకు ముందు శ్రీకాళహస్తికి వెళితే ఓడిపోతారని... ఇలా కొన్ని సెంటిమెంట్లున్నాయి. అలాగే ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఏ పార్టీలో అడుగుపెడితే ఆ పార్టీ అధికారంలోకి వస్తుందన్న సెంటిమెంట్ కూడా వుంది.**

ఆదాల రాజకీయ ప్రవేశం జరిగింది 1999 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ద్వారా! ఆ పార్టీ అభ్యర్థిగా అల్లూరు నుండి పోటీ చేసి గెలుపొందారు. 2004 ఎన్నికల్లో తెలుగుదేశాన్ని వీడి కాంగ్రెస్‌లో చేరారు. సర్వేపల్లి నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా నిలిచి గెలిచాడు. అప్పుడే కాంగ్రెస్ కూడా అధికారంలోకి వచ్చింది. 2009 ఎన్నికల్లోనూ అదే సీన్ రిపీట్! ఆయన సర్వేపల్లి నుండి రెండోసారి గెలిచాడు. కాంగ్రెస్ కూడా రెండోసారి అధికారంలోకి వచ్చింది. 2014కు ముందు రాష్ట్రంలో జరిగిన రాజకీయ పరిణామాల గురించి తెలిసిందే! రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ పూర్తిగా పతనమైన నేపథ్యంలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలుగుదేశంలో చేరాడు. ఆరోజు వైసిపి అధిష్టానం నుండి పిలుపు వచ్చుంటే ఆయన ఆ పార్టీలో చేరుండే వాడే! కాని, అప్పటికే వైసిపిలో వున్న నాయకులు తలో సీటు మీద కర్చీఫ్ వేసుకుని ఉండడం, ఆదాలకు ఎక్కడ సీటు ఇస్తామన్నది స్పష్టత ఇవ్వకపోవడంతో ఆయన తెలుగుదేశంలో చేరాడు. 2014 ఎన్నికల్లో నెల్లూరు లోక్‌సభ నుండి టీడీపీ అభ్యర్థిగా దిగాడు. గట్టిపోటీనిచ్చి ఓడిపోయాడు. ఆయన ఓడినా కూడా ఆ ఎన్నికల్లో తెలుగుదేశం గెలిచింది. ఆదాల ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ అధికారంలోకి వస్తుందన్న సెంటిమెంట్ బలపడింది.

ఈ సెంటిమెంట్ నేపథ్యంలో వచ్చే ఎన్నికలప్పటికి ఆయన ఏ పార్టీలో వుంటాడన్నది ఆసక్తికర చర్చగా మారింది. ప్రస్తుతానికైతే ఆయన నెల్లూరు రూరల్ టీడీపీ ఇన్‌ఛార్జ్‌గా వుంటున్నారు. ఈసారి లోక్‌సభకు పోటీ చేయడని, నెల్లూరు రూరల్ నుండే పోటీకి దిగుతాడని టాక్. అయితే, ఆయన టీడీపీ అభ్యర్థిగా లోక్‌సభకు పోటీ చేసినా లేక నెల్లూరురూరల్ లేదా ఇంకే అసెంబ్లీకి పోటీ చేసినా గెలుపు గ్యారంటీ లేదు. వైసిపి నుండి తీవ్ర పోటీ తప్పదు.

అదే ఆయన వైసిపిలో చేరి లోక్‌సభకు పోటీ చేసినా, ఇంకేదన్నా అసెంబ్లీకి పోటీకి దిగినా గెలుపు ఖాయమని రాజకీయ విశ్లేషకుల అంచనా!

# వే బిల్లు.. ఇక తప్పనిసరి

## - వాణిజ్యపన్నులశాఖ జేసీ కృష్ణమోహన్‌రెడ్డి



ఇతర రాష్ట్రాల్లో కొనుగోళ్ళు, అమ్మకాలకు ఇక నుంచి వే బిల్లులు తప్పనిసరిగా ఉండాలని వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. తాజాగా నూతన వే-బిల్లు విధానం అమలులోకి వచ్చిందని, దాని విధివిధానాలు వ్యాపారులందరూ తెలుసుకోవాలని అన్నారు. రూ.50 వేలు పైబడిన విలువగల సరుకుల రవాణాను ఇతర రాష్ట్రాల నుంచి చేస్తే తప్పనిసరిగా వేబిల్లు వినియోగించాలన్నారు. అదేవిధంగా ఇతర రాష్ట్రాలకు సరుకు అమ్మినా ఇదే విధానాన్ని అనుసరించాలన్నారు. రాష్ట్ర పరిధిలో సరుకు కొనుగోలు చేసి దిగుమతులు, ఎగుమతులు చేసుకుంటే వేబిల్లులు అవసరం లేదని పేర్కొన్నారు. నూతన వే బిల్లులను ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చన్నారు. అయితే, వే బిల్లు పొందేందుకు పోర్టల్‌లో రవాణాదారుడు రిజిస్ట్రేషన్ పొంది ఉండాలని, సరుకు కొనుగోలు, అమ్మకాలకు సంబంధించిన వివరాలను నమోదు చేయాలని, రిజిస్ట్రేషన్ లేకపోతే వే బిల్లు మంజూరు కాదన్నారు. ఇతర రాష్ట్రాల సరుకులు కొనుగోళ్ళు, అమ్మకాలకు పన్ను చెల్లించాల్సిన వస్తువులన్నింటికి తప్పనిసరిగా వేబిల్లులు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

# గూడూరుపై ప్రత్యేక గురి!

## గౌతమ్‌కు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు



జిల్లాలో తెలుగుదేశం పార్టీ బలంగా వుండే నియోజకవర్గాలలో గూడూరు ఒకటి! గత మూడున్నర దశాబ్దాల కాలంలో 1989, 2004, 2014 ఎన్నికల్లో తప్పితే తెలుగుదేశం ఓడిపోయింది లేదు. అది కూడా 2014 ఎన్నికల్లో వైసిపి హవా పని చేయడం, తెలుగుదేశంలో నెలకొన్న వర్గపోరు మూలంగా ఆ పార్టీ అభ్యర్థి పరాజయం చెందింది.

ఒకప్పుడు తెలుగుదేశంకు బలంగా వున్న నియోజకవర్గం ఇప్పుడు వైకాపాకు అనుకూలంగా వుంది. 2014 ఎన్నికల్లో వైకాపా అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ వై.యస్. గాలితో గెలిచాడు. ఆ తర్వాత తెలుగుదేశంలోకి జంప్ చేశాడు. నియోజకవర్గంలో సిటింగ్ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మీద వ్యతిరేకత వుంది. ఈ దశలో వైసిపి నుండి మంచి అభ్యర్థిని దించితే అటు టీడీపీ వ్యతిరేకత, ఇటు వైసిపి పట్ల ప్రజల్లో వున్న సానుకూలతతో గెలువ వచ్చని వైకాపా నాయకులు భావిస్తున్నారు.

గూడూరు నియోజకవర్గంలో వైసిపిని మరింత బలోపేతం చేసే దిశగా పార్టీ జిల్లా పరిశీలకులు సజ్జల రామకృష్ణారెడ్డి ఇటీవల నియోజకవర్గ నేతలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. పార్టీ సిఇసి సభ్యులు ఎల్లసిరి గోపాలరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఇన్‌ఛార్జ్ మేరిగ మురళీ, నేదురుమల్లి పద్మనాభరెడ్డి, నాయకుడు కోడూరు మీరారెడ్డి తదితరులతో చర్చించారు. ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్‌రెడ్డికి అదనంగా గూడూరు బాధ్యతలు అప్పగించారు.

ఇక్కడ పార్టీకి మంచి పట్టుంది. నాయకులున్నారు. ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం కాబట్టి అభ్యర్థి ఎంపికే కొంచెం కీలకం కావచ్చు. గత ఎన్నికల్లో గెలిచిన సునీల్ ఇక్కడే వుండుంటే రెండో ఆలోచన వుండేది కాదు. అతను పార్టీ మారబట్టి ఇప్పుడు కొత్త అభ్యర్థిని నిర్ణయించాల్సి వస్తుంది. ప్రస్తుతానికి ఇన్‌ఛార్జి మేరిగ మురళి, బత్తిని విజయకుమార్ లాంటి నాయకులు రేస్‌లో వున్నప్పటికీ ఎన్నికల నాటికి పార్టీకి కొత్త, నియోజకవర్గానికి పాత అయిన ముఖాలు కూడా తెరమీదకు వచ్చే అవకాశాలున్నాయి.




# నెల్లూరు కబుర్లు

## మండుతున్న ఎండలు

ఏప్రిల్ నెల మొదటి వారంలోకొచ్చాం... వేసవి కాలం సెగలు కక్కిస్తోంది. ఇప్పటికే ఉష్ణోగ్రతలు 39, 40 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఉష్ణతాపం పెరుగుతోంది. మధ్యాహ్నం వేళల్లో నగర రోడ్లపై జనసంచారం తగ్గిపోతోంది. నగరంలో సిమెంటురోడ్లు, డ్రైనేజీ పనులుచేసే కార్మికులు ఉదయం లేదా రాత్రి వేళల్లో పనులు చేస్తున్నారు. వేసవి కాలం వ్యాపారాలు కూడా మొదలయ్యాయి. అయితే ఇంతవరకు సెగగాలులు లేవు. సాయంత్రం 4గంటలకల్లా కొంచెం చల్లటి గాలి వీస్తుంది. కరెంట్ కోతలు కూడా పెద్దగా లేకపోవడంతో కాస్తా ఉపశమనంగా వుంది. అక్కడక్కడా మంచినీటి సమస్యలు మొదలయ్యాయి. నగరంలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా కార్పొరేషన్ తగు చర్యలు చేపట్టాల్సి వుంది. ముందు ముందు కాసే ఎండలు జనానికి సినిమా చూపించనున్నాయి.

## గుంటూరుకు ఇంతియాజ్

- ఇంకా తేలని జేసీ నియామకం



నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఇంకా ఎవరినీ నియమించలేదు. జేసీ-2గా వున్న వెంకట సుబ్బారెడ్డికి ఇన్‌ఛార్జ్ జేసీ బాధ్యతలు అప్పగించారు. ఇంతియాజ్ అహ్మద్ 2015 జనవరి 8వ తేదీన నెల్లూరు జేసీగా బాధ్యతలు చేపట్టారు. మూడేళ్ళ మూడు నెలల పాటు ఎటువంటి వివాదాలకు తావు లేకుండా సమర్ధవంతంగా విధులు నిర్వహించారు. ఎన్నో భూ వివాదాలను పరిష్కరించారు. రెవెన్యూ సమస్యలను తీర్చారు. ఎలాంటి ఆరోపణలకు ఆస్కారం లేకుండా తన పని తాను చేసుకుంటూ వెళ్ళారు. ఒక్క అధికారిగానే కాకుండా ఈ జిల్లాలో వ్యక్తిగత పరిచయం కూడా పెంచుకున్నారు. గతంలో ఆయన వాణిజ్య పన్నుల శాఖ ఉపకమిషనర్‌గా కూడా ఇక్కడ పని చేసి వుండడంతో నెల్లూరీ యులకు దగ్గరివాడయ్యాడు.

## 'సింహపురి' ఆసుపత్రికి అరుదైన అవార్డు



నగరంలోని సింహపురి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి మరో అరుదైన అవార్డు లభించింది. అత్యాధునిక వైద్యసేవలు అందించడం, అనుభవజ్ఞులైన వైద్య నిపుణుల బృందం, రోగుల పట్ల సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు, వైద్యరక్షణ వంటి అంశాలను ఏడాదిపాటు పరిశీలించిన ఢిల్లీకి చెందిన వైద్యబృందం ఆ మేరకు తమ ఆసుపత్రికి నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఆఫ్ హాస్పిటల్స్ అవార్డును ప్రదానం చేసిందని ఆసుపత్రి ఛైర్మెన్ కాటంరెడ్డి రవీంద్రరెడ్డి తెలిపారు. ఈ నెల 2న ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏ ఆసుపత్రికీ దక్కని అరుదైన పురస్కారం తమ ఆసుపత్రికి లభించడం తమకెంతో సంతోషం కలిగిస్తోందన్నారు. ధనానికి ప్రాధాన్యం ఇవ్వకుండా రోగి ఆరోగ్యమే ధ్యేయంగా సేవాభావంతో వైద్యులు పనిచేస్తున్నారని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గుండె వైద్యనిపుణులు డాక్టర్ భక్తవత్సలరెడ్డి, ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ వెంకటేశ్వరప్రసన్న, న్యూరో ఫిజిషియన్ డాక్టర్ దీక్షాంత్ నారాయణ్, డాక్టర్ గోపాలకృష్ణయ్య, డాక్టర్ రాజామోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

*నెల్లూరు నగరానికి ఔటర్ రింగ్ రోడ్డు... ఇది ఇప్పటి మాట కాదు... 1999-2004ల మధ్య తెలుగుదేశం అధికారంలో వున్నప్పుడు చర్చకు వచ్చింది. 2004-2014ల మధ్య కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ పలుసార్లు చర్చకు రావడం, దీనికి సంబంధించి డిజైన్‌లు గీయడం కూడా జరిగాయి.*



## రింగ్ వస్తే రియల్టర్లకు పండుగ!

### దశాబ్ది కాలపు కల... నెరవేరేనా? ఒట్టి మాటలేనా!

కాంగ్రెస్ ప్రభుత్వంలో నెల్లూరు ఎమ్మెల్యేగా వున్న ఆనం వివేకానందరెడ్డి ఔటర్ రింగ్ రోడ్డుపై కొంత కసరత్తు కూడా చేసారు. నెల్లూరురూరల్ మండలంలోని గ్రామాల గుండా రింగ్‌రోడ్డు వెళ్లేలా అప్పట్లో డిజైన్ చేసారు. ఈ డిజైన్ లీకై అప్పట్లో కొందరు ఈ రింగ్‌రోడ్డు వస్తుందనుకున్న చోట భూములు కనుగోలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండోటర్మ్‌లో వై.యస్. వుండుంటే నెల్లూరుకు రింగ్‌రోడ్డు కల సాకారమయ్యుండేదేమో! ఆయన మరణంతో ఇది మరుగున పడిపోయింది.

మళ్ళీ ఇన్నాళ్ళకు ఇటీవల 'నుడా' ఆధ్వర్యంలో రింగురోడ్డు తెరమీదకు వచ్చింది. రింగ్‌రోడ్డును ఎటునుండి ఎటు కలపాలి, ఏఏ గ్రామాల పరిధిలో భూములు సేకరించాలి, భూసేకరణకు ఎంత ఖర్చవుతుంది... వంటి వివరాలతో నుడా అధికారులు రింగ్‌రోడ్డుపై సమగ్ర నివేదిక రూపొందించడానికి కసరత్తు చేస్తున్నారు. నెల్లూరు సెంటర్‌పాయింట్ నుండి 18 కిలోమీటర్ల రేడియస్‌తో రింగ్‌రోడ్డు నిర్మాణం జరిగే అవకాశముంది. తూర్పున కోడూరుపాడు, నరుకూరు, పడమరన నరసింహకొండ, జొన్నవాడ, దక్షిణాన నార్తురాజుపాలెం, ఉత్తరాన వెంకటాచలం పరిధిలో రింగ్ రోడ్డు ఏర్పడవచ్చు.

నెల్లూరు నగరంలో ట్రాఫిక్ ఎక్కువైంది. నగరంలో రోడ్లు తక్కువ, ఒకప్పుడు ట్రంక్‌రోడ్డు ఒక్కటే. ట్రాఫిక్ అంతా దాని మీదే వుండేది. మినీబైపాస్ వచ్చాక కొంత డైవర్ట్ అయ్యింది. పెద్దబైపాస్ రావడంతో ఇంకొంచెం వెసలుబాటు దొరికింది. అయినా రోజురోజుకు వాహనాలు పెరుగుతున్నాయి. నగరంలో తొక్కిడి ఎక్కువవుతోంది. రింగ్‌రోడ్డు వస్తే నగరంపై ట్రాఫిక్ భారం తగ్గొచ్చు.

ఇక రింగ్‌రోడ్డు అంటానే రియల్టర్లు నెల్లూరు చుట్టుపక్కల రెక్కలు కట్టుకుని వాలే అవకాశముంది. నోట్ల రద్దు తర్వాత జిల్లాలో రియల్ వ్యాపారం లేదు. రింగ్ రోడ్డు వస్తుందంటే రియల్టర్లకు పండుగే కావచ్చు.

## పోలీసు అధికారుల సంఘం ఎన్నికలు జరపండి



ఎం.ప్రసాదరావు

ఏ.పి పోలీసు అధికారుల సంఘానికి వెంటనే ఎన్నికలు జరపాలని సంఘం నెల్లూరుజిల్లా అధ్యక్షులు ఎం.ప్రసాదరావు ఏ.పి డిజిపికి విజ్ఞప్తి చేసారు. పోలీసు అధికారుల సంఘంకు కాలపరిమితి మూడేళ్ళే అయినప్పటికి ప్రస్తుతం సంఘం ఏర్పడి 5ఏళ్ళవుతుంది, సంఘానికి ఎన్నికలు జరిపించమని ఇప్పటికే పలుదఫాలు అధికారులను కోరారు. రాష్ట్ర విభజన సమయంలో అప్పటి అధ్యక్షుడు తెలంగాణకు పోగా ఏ.పి సంఘానికి అడహక్ అధ్యక్షుడిగా జె.శ్రీనివాసరావును నియమించుకోవడం జరిగింది. అప్పటి నుండి ఆరు నెలల్లో సమావేశం నిర్వహించి కొత్త రాష్ట్ర అధ్యక్షుడిని ఎన్నుకోవాల్సి వుండగా ఆయన అవేమీ పట్టించుకోకుండా స్వంత పనులను సరిదిద్దుకుంటున్నారు. రాష్ట్రంలో పోలీసు సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారు. బందోబస్తు సిబ్బందికి కనీస వసతులుండడం లేదు. అవసరానికిమించి సిబ్బందిని డ్రా చేస్తున్నారు. 25ఏళ్ళుగా ప్రమోషన్‌లు రావడం లేదు. పోలీసు సిబ్బంది సమస్యలపై ప్రస్తుత అడహక్ అధ్యక్షులు ఒక్కసారి కూడా సమావేశం నిర్వహించలేదు. కాబట్టి డిజిపి వెంటనే జోక్యం చేసుకుని పోలీసు అధికారుల సంఘంకు వెంటనే ఎన్నికలు జరిపించాలని కోరారు.

ఆధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

### విఆర్ ఉన్నతపాఠశాలలో వెల్లివిరిసిన సంబరం




నెల్లూరు విఆర్ ఉన్నతపాఠశాల పూర్వ విద్యార్థులంతా కలసి సంతోషంగా తమ స్నేహాభిమానాన్ని పంచుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఆనందించారు. 1978 నుంచి 1982దాకా 6 నుంచి 10వ తరగతి దాకా చదువుకున్న విద్యార్థులు ఇటీవల విఆర్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. సుమారు 40 ఏళ్ళ తర్వాత ఇప్పుడు అనేకమంది వివిధ ఉన్నతస్థాయిల్లో ఉన్నప్పటికీ, అందరూ తాము చిన్నప్పుడు చదువుకున్న పాఠశాలకు వచ్చి చిన్ననాటి స్నేహాలను గుర్తుకుతెచ్చుకుంటూ తమ ఆత్మీయతను పంచుకోవడం విశేషం. ఈ సందర్భంగా తమకు పాఠాలు చెప్పిన గురువులకు విశ్రాంత ఉపాధ్యాయులకు గౌరవ పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు విశ్రాంత ఉపాధ్యాయులు ఐ.నరసింహారెడ్డి, ఎం.చంద్రశేఖరరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, గాదం రమణయ్య, స్వయంపాకుల శ్రీనివాసులు తదితరులకు విద్యార్థులు ఎంతో గౌరవపూర్వక ఆత్మీయ సన్మానాలు అందజేశారు. పూర్వ విద్యార్థులు, శాప్ మాజీ డైరెక్టర్ ఎం. రవీంద్రబాబు, ఏపిసిసి సభ్యులు భవాని నాగేంద్రప్రసాద్, పారిశ్రామికవేత్తలు వినోద్, హరినాథరెడ్డి, సినిమా డైరెక్టర్ గోపి, ప్రముఖ వైద్యులు డి. నారాయణరెడ్డి, విఆర్‌కళాశాల విద్యార్థిసంఘం మాజీఅధ్యక్షులు నాగారెడ్డి రవీంద్రరెడ్డి, సురేష్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## పెన్నానదిలో పేదల ఇళ్ళా?

**- జనసేన విమర్శ**

పెన్నా నదిలో పేదల ఇళ్ళేమిటంటూ జనసేన నాయకుడు రాజాయాదవ్ విమర్శించారు. భవిష్యత్తులో నదికి వరదలు వస్తే ఈ ఇళ్ళకు ప్రమాదం జరగదా అని ఆయన అంటూ, అసలు ఈ ఇళ్ళు ఇక్కడ కట్టడంలో ఆంతర్యం ఏమిటో విచారణ జరిపించాలన్నారు. ఈ నెల 2న ఆ మేరకు జనసేన కార్యకర్తలు, నాయకులు జేసి-2 వెంకటసుబ్బారెడ్డిని కలసి పెన్నానదిలో నిర్మిస్తున్న ఈ ఇళ్ళపై విచారణ చేపట్టాలంటూ వినతిపత్రం సమర్పించారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని జనార్ధన్‌రెడ్డి కాలనీలో పెన్నా నది ఒడ్డున 'హౌస్ ఫర్ ఆల్' పథకం కింద ప్రభుత్వం పేదల ఇళ్ళను అపార్ట్‌మెంట్‌ల రూపంలో నిర్మిస్తున్నారని, అయితే ప్రభుత్వ అడంగల్ సర్వేనెంబర్ 2062-3 నెల్లూరు బిట్-2 ప్రకారం మొత్తం భూమి కూడా పెన్నానది కింద ఉందని చూపిస్తోందని జనసేన నాయకుడు రాజాయాదవ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. నగర పరిధిలో మరెక్కడా ప్రభుత్వ స్థలమే లేనట్లుగా పెన్నానదిలో ఈ ఇళ్ళను నిర్మించడం దారుణమైన విషయమన్నారు. ఇందులో ఉన్న మర్మమేమిటో తెలియాలన్నారు. ఈ సర్వేనెంబర్‌లో నిర్మిస్తున్న ఇళ్ళను పూర్తిగా పర్యవేక్షించి తగిన విచారణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యకర్తలు అజయ్, షాకీర్, సాయి భగవాన్, మారుతి, మణి తదితరులు పాల్గొన్నారు.



జేసి-2 వెంకటసుబ్బారెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న జనసేన కార్యకర్తలు

# బీసీల భుజం తట్టేందుకే ఆదరణ

## - వ్యవసాయ మంత్రి సోమిరెడ్డి


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

బలహీనవర్గాల ప్రజలకు అనేక రకాల ప్రయోజనాలు కల్పించే విధంగా ఈ నెల 10 నుండి రెండురోజుల పాటు నెల్లూరులో ఆదరణ పథకం ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. 1వ తేదీన నెల్లూరులోని ఆర్ అండ్ బి అతిథిగృహంలో ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదరణ పథకం ద్వారా బీసీలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. 10వ తేదీన నెల్లూరు విఆర్ హైస్కూల్ మైదానంలో ఆదరణ ఎగ్జిబిషన్‌ను బి.సి సంక్షేమ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ప్రారంభిస్తారని, మంత్రులు అమర్‌నాథ్‌రెడ్డి, పి.నారాయణలు కూడా హాజరవుతారని తెలిపారు. అదేరోజు 5కోట్లతో నిర్మించనున్న మహాత్మాజ్యోతిరావ్ పూలే భవన్ నిర్మాణానికి మంత్రులు శంకుస్థాపన చేస్తారని ఆయన పేర్కొన్నారు. ఆధునిక చేతివృత్తుల పనిముట్లను ఈ ఎగ్జిబిషన్‌లో వుంచాలని ఆయన అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళపై కూడా ఆయన సమీక్షించారు. ధాన్యం కొనుగోళ్ళను వేగవంతం చేయాలని, రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు.

ఈ సమావేశంలో ఇన్‌ఛార్జ్ జేసీ వెంకటసుబ్బారెడ్డి, బీసీ కార్పొరేషన్ ఇ.డి వెంకటస్వామి, వ్యవసాయశాఖ జె.డి చంద్రనాయక్, మత్స్యశాఖ జె.డి రామ్ శంకర్ నాయక్, పశుసంవర్ధకశాఖ జె.డి భరత్ రమేష్, ఆర్డీఓ హరిత పాల్గొన్నారు.

# శ్రీధర్ తాతయ్యాడు


నెల్లూరు రూరల్ యం.యల్.ఏ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తాతయ్యాడు. ఆయన పెద్దకుమార్తె లక్ష్మీహైందవి ఏప్రిల్ 3వ తేదీ తెల్లవారుఝామున బెంగుళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. నాన్న నుండి తాతగా ప్రమోషన్ అందుకున్న శ్రీధర్‌కి, అమ్మమ్మైన ఆయన శ్రీమతికి, చిన్నారి అమ్మా నాన్నలకు 'లాయర్' శుభాకాంక్షలు.

# అన్నింటా మనమే బెస్ట్!


- కలెక్టర్ ముత్యాల రాజు

ఉపాధి హామీ పథకం అమలులో నెల్లూరుజిల్లా రాష్ట్రంలోనే రెండోస్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాల రాజు ఒక ప్రకటనలో తెలిపారు. 2017-18 సంవత్సరానికి గాను ఉపాధిహామీ పథకంలో భాగంగా కూలీలకు 1.15కోట్ల పని దినాలు కల్పించాల్సివుండగా, లక్ష్యాన్ని అధిగమించి 1.19కోట్ల పని దినాలను కల్పించామని పేర్కొన్నారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో ప్రగతి శాతం 102.30 వుండగా ఈ ఆర్థిక సంవత్సరంలో దానికంటే 1.66శాతం ఎక్కువ సాధించామన్నారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకం క్రింద కూలీలకు 170.09 కోట్లు చెల్లించగా ఈ ఆర్థిక సంవత్సరంలో 171.82 కోట్లు చెల్లించామని ఆయన వెల్లడించారు. జిల్లాలో 41140 కుటుంబాలకు వంద రోజుల పని దినాలను కల్పించడం జరిగిందని తెలిపారు. అదే విధంగా వర్షపు నీటిని సద్వినియోగం చేసుకునే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన పంట సంజీవని కార్యక్రమంలో 16వేల గుంటలు తవ్వాల్సివుండగా 10.89 శాతం పూర్తి చేసి రాష్ట్రంలో మూడవ స్థానంలో నిలిచాము. ఎన్టీఆర్ జలసిరి పథకంలో 1600బోర్లు వేయాల్సి వుండగా, లక్ష్యాన్ని అధిగమించి 2010 బోర్లు వేసి ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచాం. సోలార్ పంపుసెట్ల ఏర్పాటులో రాష్ట్రంలోనే మన జిల్లా మూడో స్థానంలో వుంది. జిల్లాలో 39.80కోట్లతో 1137 సోలార్ పంపుసెట్లను ఏర్పాటు చేయడం జరిగింది. ఎస్సీ, ఎస్టీ భూములలో 1500 ఎకరాలలో పండ్ల తోటలను పెంచాల్సి వుండగా లక్ష్యాన్ని అధిగమించి 1577 ఎకరాలలో పెంచాం. చంద్రన్న బాట కార్యక్రమంలో 462కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు వేయాల్సి వుండగా 82.25కోట్ల ఖర్చుతో దళిత వాడల్లో 470కిలోమీటర్ల సిమెంట్‌రోడ్లు వేసి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచాం. ఉపాధిహామీ పథకం నిధుల అనుసంధానంతో చేపట్టిన 320 అంగన్‌వాడి భవనాల నిర్మాణానికి గాను 165 భవనాలు పూర్తి చేసాం. 94 భవనాలు నిర్మాణంలో వున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు.




పుణ్య సంస్మరణ

మాన్యుడు, మరపురాని నేత

శ్రీ సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి గారు

కీర్తిశేషులై ఏప్రిల్ 6వ తేదీకి 35 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా

ఆ పుణ్యమూర్తిని స్మరిస్తూ...

వారి పవిత్రాత్మకు భక్త్యంజలి ఘటిస్తున్నాము.

కుమారుడు - కోడలు: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి - జ్యోతి

రాష్ట్ర వ్యవసాయ, హార్టికల్చర్, సెరీకల్చర్, అగ్రిప్రాసెసింగ్ శాఖామాత్యులు

కుమార్తెలు - అల్లుళ్ళు

కట్టంరెడ్డి రాణీసంయుక్త - రాధాకృష్ణారెడ్డి

కేతిరెడ్డి ఉషారాణి - రామకోటారెడ్డి

| మనుమలు | మనుమరాండ్రు | మునిమనుమలు | మునిమనుమరాండ్రు |
|---|---|---|---|
| సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి | శ్రుతి | యల్లా శర్వీన్ | యల్లా సంజన |
| డా॥ సోమిరెడ్డి అర్జున్‌రెడ్డి | లక్ష్మీఐషిత | కేతిరెడ్డి శ్రీమన్ | సోమిరెడ్డి శివాని |
| నిమ్మ కౌశిక్‌రెడ్డి | డా॥ సింధు | నిమ్మ ధీర్ | కేతిరెడ్డి శ్రితిక |
| సన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి | నీలిమ | కేతిరెడ్డి శ్రీవంత్ | కట్టంరెడ్డి శ్రీశాన్వి |
| యల్లా సనత్‌రెడ్డి | షాలిని | సన్నారెడ్డి రాయల్ భార్గవ్ | కట్టంరెడ్డి హవిష |
| డా॥ కేతిరెడ్డి కళాధర్‌రెడ్డి | డా॥ మాలిని | నిమ్మ నరేన్ | సన్నారెడ్డి నిరుక్తలేఖ |
| కేతిరెడ్డి శశధర్‌రెడ్డి | కీర్తి | | సోమిరెడ్డి అమైరా |
| కట్టంరెడ్డి విక్రమ్‌రెడ్డి | స్నిగ్ధ | | |

# లబ్ధిదారులకు వెంటనే రుణాలందించాలి

**- మంత్రి డా.నారాయణ**



సంక్షేమ పథకాలం కింద వివిధ కార్పొరేషన్‌లలో ఎంపికైన లబ్ధిదారులకు సత్వరమే రుణాలు అందించేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డా. పొంగూరు నారాయణ అన్నారు. ఈనెల 1న ఆయన నారాయణ మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన అధికారులు, బ్యాంకర్లు, వివిధ సంఘాల నాయకులతో జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులు బిసి కార్పొరేషన్ కింద 2017-18 సంవత్సరానికి 2520 మందికి రుణాలందించాలని లక్ష్యంగా ఉంటే, 3200 మందిని ఎంపిక చేశామని, అదేవిధంగా ఎస్‌సి కార్పొరేషన్ కింద 3518 ధరఖాస్తుల్లో 3218 మందికి రుణాలు మంజూరయ్యాయని, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 1953 మందికి రుణాలివ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా, 1730 మందికి రుణాలు మంజూరయ్యాయని, 509 మందికి సబ్సిడీ విడుదలైందని మంత్రికి తెలియజేశారు. జిల్లాలో సంక్షేమ పథకాల అమలును, పురోగతిని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు మంత్రికి తెలియజేశారు. ఈ సమావేశంలో నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, జేసీ-2 వెంకటసుబ్బారెడ్డి, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ చాట్ల నరసింహారావు, మునిసిపల్ కమిషనర్ ఆలీంబాషా, ఆర్డీఓ హరిత, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్‌రావు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# సమస్యలు ఇవి... పరిష్కరించండి

**---- కలెక్టర్‌ను కోరిన ఆదాల ----**



మాజీమంత్రి, నెల్లూరురూరల్ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ముత్యాలరాజును కలిసారు. నెల్లూరురూరల్ నియోజకవర్గంలోని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగా కోడూరుపాడు, నారాయణ రెడ్డిపేటలలో 2వేల మంది అర్హులైన పేదలకు ఇళ్ళ స్థలాలతో పాటు పక్కాఇళ్ళు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. సీఎం హామీని ఆచరణలో పెట్టడానికి చర్యలు తీసుకోవాలి. భూగర్భ డ్రైనేజీకి సంబంధించి పొట్టేపాలెంలో నెలకొన్న భూసమస్యలను పరిష్కరించాలి. చంద్రమౌళినగర్‌లో వందలాది మంది పేదలు ఇళ్లు కట్టుకుని వుంటున్నారు. వారి ఇళ్ళను క్రమబద్ధీకరించాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, టీడీపీ నాయకులు కోదూరు కమలాకర్‌రెడ్డి, సన్నపరెడ్డి పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'మీ సేవ' మరింత ముమ్మరం

ప్రజల దైనందిక వ్యవహారాలలో 'మీ సేవ' సెంటర్లు ఒక భాగమయ్యాయి. అన్ని బిల్లులు, అన్ని రకాల పన్నులు చెల్లించడానికి గాని, అన్ని ప్రభుత్వ శాఖల సేవలను పొందుటకుగాని 'మీ సేవ' కేంద్రాలు వేదికగా మారాయి. 'మీ సేవ' కేంద్రాలకు పెరుగుతున్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని జిల్లాలో మరో 222 'మీ సేవ' కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈమేరకు ఇన్‌ఛార్జ్ జేసీ వెంకట సుబ్బారెడ్డి ఆదేశాలిచ్చారు. ప్రతి ఐదువేల జనాభాకు ఒక 'మీ సేవ' కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే 222 మీ సేవ కేంద్రాలలో 63 పట్టణ ప్రాంతాలలో మిగిలినవి గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 222 మీ సేవ కేంద్రాలుండగా వాటిలో 65 కేంద్రాలు అర్బన్ ప్రాంతాలలోనూ మిగిలినవి రూరల్ ప్రాంతాలలోనూ వున్నాయి. ఇప్పుడు మంజూరైన మీ సేవ కేంద్రాలను పరిగణనలోకి తీసుకుంటే ఇవి డబుల్ కానున్నాయి.

# వైభవంగా ముగిసిన... చెన్నకేశవుని బ్రహ్మోత్సవాలు



వింజమూరులోని చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు ఈ నెల 4వ తేదీ ఏకాంత సేవతో వైభవంగా ముగిసాయి. 9రోజుల పాటు నిర్వహించిన ఈ తిరునాళ్ళను ఎంతో వేడుకగా నిర్వహించారు. మార్చి 27వ తేదీ అంకురార్పణతో తిరునాళ్ళు



ప్రారంభమయ్యాయి. 28వ తేదీ ధ్వజారోహణం, శేషవాహనోత్సవం జరిగింది. 29వ తేదీ కొత్తూరు భక్తులు ఉభయకర్తలుగా పొన్న వాహనోత్సవం, 30వ తేదీ పాతూరు భక్తులచే హనుమంత సేవ, 31వ తేదీ నడిమూరు భక్తులచే గరుడసేవ, ఏప్రిల్ 1వ తేదీ ఎర్రబల్లిపాలెం భక్తులచే కళ్యాణోత్సవం వేడుకలు అంగ రంగ వైభవంగా జరిగాయి. ప్రతిరోజూ పలు రకాల సంగీత వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 2వ తేదీ ఉదయం వేలాది మంది భక్తుల 'జై చెన్నకేశవ' నినాదాల మధ్య రథోత్సవం నిర్వహించారు. దేవస్థానం నుండి బయలు దేరిన రథం ఎర్రబల్లిపాలెం, కొత్తూరు, నడిమూరు, పాత బస్టాండ్‌ల మీదుగా గంగమిట్టకు చేరి తిరిగి దేవాలయంకు చేరుకుంది. దారి పొడవునా భక్తులు రథం ముందు గుమ్మడి కాయలు, టెంకాయలు కొట్టి తమ మొక్కులు చెల్లించుకున్నారు. పలు స్వచ్ఛంధ సంస్థలు, వ్యక్తులు, భక్తులు మజ్జిగ, ప్రసాదాలు పంపిణీ చేశారు. 3వతేదీ పారువేట, 4వతేదీ ఏకాంత సేవతో తిరునాళ్ళు ముగిసాయి. 9రోజులు పాటు జరిగిన బ్రహ్మోత్సవాలను ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు గణపం సుదర్శన్‌రెడ్డి, గణపం రమణారెడ్డి, ఇ.ఓ నవీన్‌కుమార్‌లు పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా వింజమూరు ఎస్.ఐ జిలాని బాషా బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

# ఆయన పసుపు కలెక్టర్

**- కాకాణి ఫైర్**

జిల్లా కలెక్టర్ ముత్యాలరాజుపై వైసిపి జిల్లా కన్వీనర్, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కలెక్టర్ ముత్యాలరాజు అధికారపార్టీ నాయకులకు పి.ఏగా మారాడంటూ మండిపడ్డారు. వెంకటాచలం మండలం రామదాసుకండ్రికలో జరిగిన ఫోర్జరీ డాక్యుమెంట్ల భాగోతంపై విచారణ జరిపించాలంటూ ఆయన 2వ తేదీ కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌ఛార్జ్ జాయింట్ కలెక్టర్ వెంకటసుబ్బారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కలెక్టర్ పసుపు చొక్కా తగిలించుకుంటున్నాడు. మరుగుదొడ్ల నిర్మాణంలో కుంభకోణం జరిగితే దానిని పట్టించుకోకుండా మరుగుదొడ్ల నిర్మాణంలో జిల్లాను నెంబర్ 1 స్థానంలో నిలబెట్టానంటూ పసుపు పచ్చ బ్యానర్లు వ్రాయించుకోవడం సిగ్గుచేటన్నారు.



ఇన్‌ఛార్జ్ జేసీకి వినతిపత్రం సమర్పిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

జిల్లాలో జరిగిన ఏ కుంభకోణం మీద విచారణ లేదు, చర్యలు లేవు. క్రింది స్థాయి ఉద్యోగులను మాత్రం ఆయన వేధిస్తున్నారని కాకాణి ఆగ్రహించాడు. ఈ కలెక్టర్ వచ్చాక ఒక్క పేదవాడికి కూడా న్యాయం చేసిన దాఖలాలు లేవన్నారు.

# భక్తిశ్రద్ధలతో ఈస్టర్ ప్రార్థనలు

ఈస్టర్ పర్వదినం సందర్భంగా ఈ నెల 1న నెల్లూరు నగరంలోని పలు చర్చిల్లో క్రీస్తు పునరుత్థాన పండుగ (ఈస్టర్)ను ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులు అన్ని చర్చిలను విద్యుద్దీపకాంతులతో శోభాయమానంగా అలంకరించారు. చర్చిలలో ఉన్న శిలువ వద్ద కొవ్వొత్తులు వెలిగించి భక్తితో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బిషప్ ఎం.డి ప్రకాశం మాట్లాడుతూ, మానవుల పాపాలను పరిహరించేందుకు ఏసుక్రీస్తు శిలువపై మృతిచెంది, తిరిగి మూడోరోజు పునరుత్థానమయ్యారని, అందుకే ఈ పండుగను క్రీస్తు పునరుత్థాన పండుగగా జరుపుకుంటున్నామని అన్నారు. ఏసుక్రీస్తు మరణించినా మానవాళి చీకట్లను తొలగించి వెలుగులను ప్రకాశింపజేశాడని, ఆ దేవుడు ప్రసాదించిన వెలుగులో మనమంతా పరిశుద్ధులుగా జీవించాలని ఉద్బోధించారు. నగరంలోని తెలుగు బాప్టిస్టు చర్చి, పునీత జోసప్ప చర్చి, డానీహాల్, లూథరన్ చర్చి, పెంతెకొస్తు చర్చి, సాల్వేషన్ ఆర్మీ చర్చి తదితర చర్చిల్లో క్రైస్తవభక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఈస్టర్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బిషప్‌లు, గురువులు ఎం.డి ప్రకాశం, జోసఫ్, జార్జి విలియం, సునీల్, ఆనంద్, బోస్కో తదితరులు పాల్గొని భక్తులకు ఈస్టర్ పండుగ విశిష్టతను వివరించారు.

అదేవిధంగా, పవిత్రమైన ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని కపాడిపాళెంలో అరవరాయప్ప కుటుంబ సభ్యులు నిర్వహించిన క్రీస్తు పునరుత్థాన ఉత్సవంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

# వైసిపి వైపు నేతల చూపు

(3వ పేజీ తరువాయి)

మరోవైపు హోదా పోరు పతాకస్థాయికి చేరుకోవడంతోనూ జిల్లాలోని నియోజకవర్గాల అభ్యర్థుల నిర్ణయం మరికొద్ది నెలలు వాయిదా పడే అవకాశం ఉంది. మిగిలిన నియోజకవర్గాలలో సర్వేపల్లి మినహా మిగిలిన నెల్లూరు నగరం, రూరల్, సూళ్లూరుపేటలలో అభ్యర్థులు దాదాపు ఖరారైపోయినట్లే.

ఏది ఏమైనా రాబోయే ఎన్నికలు ప్రతిష్ఠాత్మకమైనవి. ఇక్కడ అందరి ధ్యేయం ఒక్కటే కావాలి. అది కేవలం వై.యస్.జగన్ ముఖ్యమంత్రి కావాలి. రాష్ట్రంలో వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ సుపరిపాలన అందించాలి. ఇదొక్కటే నినాదం కావాలి. ఇదొక్కటే లక్ష్యం కావాలి. ఇదొక్కటే అంతిమ నిర్ణయం కావాలి. అప్పుడే పార్టీ విజయం నల్లేరుపై నడకలా సాగుతుంది. వేచిచూద్దాం ఏం జరుగుతుందో...!

# ప్రత్యేకహోదా రాకుంటే భవిత అంధకారమే

**-వైఎస్సార్సీపి విద్యార్థినాయకుడు శ్రావణ్**

రాష్ట్రానికి ప్రత్యేకహోదా రాకుంటే విద్యార్థుల భవిష్యత్ అంధకారమే అవుతుందని వైఎస్సార్సీపి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ అన్నారు. నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్‌లో ఈ నెల 4న వైఎస్సార్సీపి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేకహోదా కోసం ఆందోళన చేశారు. ఆటోలు, బైక్‌లు, బస్సులను తుడిచి వినూత్నంగా తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రావణ్ మాట్లాడుతూ, ప్రత్యేకహోదా కోసం వైఎస్సార్సీపి ఎంపీలు రాజీనామా చేసి దీక్షకు కూర్చోవడానికి సిద్ధమవుతున్నారని, అయితే టిడిపి ఎంపీలు ఇంతవరకు రాజీనామాలు చేయకపోవడం విడ్డూరమన్నారు. వారు తమ పదవులకు రాజీనామాలు చేసిన తర్వాతనే రాష్ట్రంలో అడుగుపెట్టాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో వైఎస్సార్సీపి విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి హాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణయాదవ్, కమల్, నగర ప్రధాన కార్యదర్శులు నిఖిల్, వినీల్, నాయకులు ఒలివా, శ్రీకాంత్, రాజశేఖర్ పాల్గొన్నారు.

# పుస్తకాలు పంపిణీ

స్థానిక కిసాన్‌నగర్‌లోని నగరపాలక సంస్థ పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం చర్మకారుల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు పంపిణీ చేశారు. టీడీపి కార్పొరేటర్ మామిడాల మధు, సంఘం అధ్యక్షుడు ఎం.దాసు, మాలమహానాడు నగర ఉపాధ్యక్షుడు బూరగ పురుషోత్తమ్ పాల్గొన్నారు.

# చక్రబంధంలో చంద్రం

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుత రాజకీయ పరిణామాలు చూస్తుంటే రాజకీయ విశ్లేషకులకు ఇలాంటి అనుమానాలే కలుగుతున్నాయి.

కేంద్ర ప్రభుత్వం ఈ టర్మ్‌కు సంబంధించి చివరి బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. జగన్ ప్రత్యేకహోదా ఉద్యమాన్ని ఉధృతం చేయడంతో చంద్రబాబుకు ఊపిరాడలేదు. ఆయన కూడా జగన్ బాటలోకి రాక తప్పలేదు. ఈ నేపథ్యంలోనే ఆయన ఎన్డీఏతో తెగదెంపులు చేసుకుని బయటకు పోవడం జరిగింది. బీజేపీతో కటీఫ్ చెప్పాడనేగాని ఆయన మనసు మనసులో లేదు. మునుపటిలా ప్రశాంతంగా లేదు. ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలేవీ ఆయనకు మింగుడుపడడం లేదు. తన వాడు, మంచి వాడు అనుకున్న పవన్ కళ్యాణే అనూహ్యంగా అడ్డం తిరిగాడు. తన మీద కాకుండా ఏకంగా తన కొడుకు లోకేష్ మీద పవన్ అవినీతి ఆరోపణలు చేయడాన్ని చంద్రబాబు జీర్ణించుకోలేకపోతున్నాడు. లోకేష్‌ను తన రాజకీయ వారసుడిగా తెరమీదకు తెచ్చాడాయన. చంద్రబాబు మీద అవినీతి ఆరోపణలు చేస్తే అదోరకం. 40ఏళ్ల సీనియర్ కాబట్టి వాటిని తట్టుకుని నిలబడగలడు. తాను నిప్పు అని పచ్చమీడియా చేత చెప్పించుకోగలడు. ఎందుకంటే ఈ వయసులో ఎన్ని అవినీతి ఆరోపణలు చేసినా ఆయనకు పోయేదేమీ లేదు. దుమ్ము దులుపుకుని పోతుంటాడు. కాని లోకేష్ మీద అవినీతి ఆరోపణలే ఓ పట్టాన మింగుడు పడేవి కావు. ఎందుకంటే లోకేష్ రాజకీయ ప్రయాణం ఇప్పుడే మొదలైంది. తండ్రి చాటు బిడ్డ. జగన్‌లా రాటుదేలిన నాయకుడు కాదు. ప్రజాక్షేత్రంలో నిలిచి గెలిచిన యువకుడూ కాదు. అడ్డదారిలో మంత్రయ్యాడు. ఇలాంటి లోకేష్‌ను ఒక పరిణితి చెందిన రాజకీయ నేతగా తీర్చిదిద్దాలంటే చంద్రబాబు బాగా తోమాలి. ఆయన తోముడు మొదలుపెట్టే లోపే లోకేష్ పెద్ద అవినీతిపరుడంటూ పవన్ పెద్ద బండ వేసాడు. వైసిపి నేతలు ఇలాంటి ఆరోపణలు చేసుంటే పెద్దగా ప్రభావం వుండేది కాదు. నిన్నటి వరకు తెలుగుదేశం మద్దతుదారుగా వున్న పవన్ చేసే సరికే చంద్రబాబుకు చివుక్కుమంది.

నాలుగేళ్లుగా ప్రతిపక్ష వైకాపా చంద్రబాబు అవినీతి అక్రమాలపై దుమ్మెత్తిపోస్తూనే వుంది. అయినా కూడా చంద్రబాబు ఏరోజూ లెక్క చేయలేదు. వైకాపాకు చెందిన ముగ్గురు ఎంపీలను, 23మంది ఎమ్మెల్యేలను కొనేసాడు. అసెంబ్లీలో ప్రతిపక్షం నోరు నొక్కే ప్రయత్నం చేసాడు. రాష్ట్రంలో ఎక్కువ శాతం మీడియా ఆయన పట్ల అనుకూలంగా వుండడం కూడా చంద్రబాబుకు కలిసొచ్చింది. పోలవరం అంచనాలు భారీగా పెంచినా, అమరావతి భూములతో వ్యాపారం మొదలుపెట్టినా, పట్టిసీమ, పుష్కరాల పేరుతో అంతులేని అవినీతి జరిగినా, తెలంగాణ 'ఓటు-నోటు' వ్యవహారంలో పబ్లిక్‌గా దొరికినా కేంద్రంలో భాగస్వామిగా వుండడం, న్యాయవ్యవస్థలో సైతం పచ్చపాతవాదులుండడం, అన్నింటికి మించి ప్రభుత్వ వైఫల్యాలను బయట ప్రపంచానికి కనిపించకుండా తమ కెమెరాలతో కప్పిపెట్టే మీడియా వుండడంతో ఇప్పటిదాకా ఆయన ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లుగా సాగింది.

ఇకముందు అలా వుండదు. రాష్ట్రంలో ప్రతిపక్షాలన్నీ ప్రభుత్వ అవినీతిపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టాయి. ప్రత్యేకహోదా విషయంలో ఆయన అనుసరించిన రెండు నాల్కల ధోరణితో పార్టీకి మైలేజీ తగ్గిపోయింది. ఇప్పుడు వైసిపి, వామపక్షాలే కాకుండా నిన్నటివరకు మిత్రపక్షంగా వున్న బీజేపీ కూడా చంద్రబాబు అవినీతిపై ఆరోపణలు ఎక్కుపెట్టింది. పోలవరం, పట్టిసీమ వంటి ప్రాజెక్టుల్లో నెలకొన్న అవినీతిని లెక్కలతో సహా చెప్పిమరీ కడిగేస్తున్నారు. ఏపికి కేంద్రం పంపిన నిధులకు, చంద్రబాబు కేంద్రానికి పంపిన యూసిలకు పొంతన కుదరడం లేదు. చేయని పనులను చేసినట్లుగా, కట్టని భవనాలను కట్టినట్లుగా ఇక్కడ నుండి యూసిలు పంపారని తెలుస్తోంది. ఇక పోలవరం అక్రమాలైతే యూపిఏ హయాంలో జరిగిన కామన్‌వెల్త్ క్రీడల స్కాంను మరపిస్తున్నాయని సమాచారం. అక్రమాలను బీజేపీ నాయకులే లెక్కలతో సహా చెబుతున్నారు.

ఇటు చూస్తే తమకు అడ్డం తిరిగిన నాయకులను నరేంద్రమోడీ, అమిత్‌షాలు తొక్కుకుంటూ వస్తున్నారు. చంద్రబాబు విధిలేని పరిస్థితుల్లో వారికి అడ్డం తిరిగాడు. మనసులో వారి పట్ల భయం అలాగే వుంది. ఆయనపై 18కేసులు స్టేలో వున్నాయి. వీటిలో 'ఓటు-నోటు' కేసుపై స్టే ఎత్తేస్తే చాలు... చంద్రబాబుకు చుక్కలే! ఎమ్మెల్యేలు, ఎంపీల కొనుగోలు వ్యవహారం పబ్లిక్‌గానే జరిగింది. ఏ డబ్బులతో వీరిని కొన్నారనే సమాచారం కూడా కేంద్రం వద్ద ఉన్నట్లు తెలుస్తోంది. పోలవరం అక్రమాల లెక్కలు కూడా కేంద్రం వద్ద వున్నాయి. అమరావతికి ఇచ్చిన నిధుల వినియోగం పైన, పోలవరం నిర్మాణంపైనా సిబిఐ లేదా ఇంకేదైనా సంస్థ చేత విచారణ జరిపిస్తే చాలు... చంద్రబాబు బొక్కలు బయటపడతాయి. దీనికితోడు ఈమధ్య ఆయన కాంగ్రెస్‌కు దగ్గరవుతున్నాడన్న సమాచారం కూడా కేంద్రం వద్ద వుంది. ఈ పరిణామాల నేపథ్యంలో మోడీ, అమిత్‌షాలు ఆయనపై ఎప్పుడు పంజా విసురుతారో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

మరోపక్క చూస్తే వైకాపా రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ఢిల్లీ లెవల్లో ఆయనకు చుక్కలు చూపిస్తున్నాడు. భారత్‌లో బ్యాంకులకు వేలకోట్లు అప్పులు ఎగ్గొట్టి లండన్‌లో దాక్కున్న విజయ్ మాల్యాను చంద్రబాబు కలిసాడని, ఆయన వద్ద 150కోట్ల పార్టీ ఫండ్ తీసుకున్నాడని విజయసాయిరెడ్డి చేసిన ఆరోపణలు ఏపి రాజకీయాలలోనే కాక, ఢిల్లీ రాజకీయాలలోనూ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ చిక్కులనుండి బయటపడాలని జాతీయ రాజకీయాలలో తన ప్రభావం చూపాలని చెప్పి ఆయన ఢిల్లీ వెళ్ళినా పెద్దగా ఫలితం కానరాలేదు.

మొత్తానికి చంద్రబాబు పరిస్థితి చక్రబంధంలో ఇరుక్కున్నట్లయ్యింది. ఈ నాలుగేళ్లు అడ్డు అదుపు లేకుండా ఏలాడు. ఈ నాలుగేళ్లలో చేసిన అక్రమాలే ఇప్పుడు పాపాలుగా శాపాలై వెంటాడుతున్నాయి.

# ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బదిలీ

రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పిఎఫ్) ఇన్‌స్పెక్టర్ ఎం.రవిశంకర్‌ను గుంతకల్ డివిజన్‌కు బదిలీ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో పనిచేస్తున్న ప్రసాద్ రావును నియమించారు.

# అమరావతికి అప్పు.. ఆంధ్రోళ్ళకు ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

అప్పు కోసం దరఖాస్తు చేసుకున్నారు. బ్యాంకు మేనేజర్ చెరో ఐదు లక్షల ఋణం మంజూరు చేసాడు. చంద్రశేఖర్ తన కొచ్చిన ఐదు లక్షలతో ఒక కారు కొన్నాడు. దానికి ఆయిల్ పోసుకుంటూ రోజూ జల్సాగా తిరిగేవాడు. రాజశేఖర్ మాత్రం తీసుకున్న ఋణంతో ఒక ఫ్యాన్సీ షాపు పెట్టుకున్నాడు. దాని మీద వచ్చిన ఆదాయంతో బ్యాంకుకు నెలసరి వాయిదాలు సక్రమంగా చెల్లించసాగాడు. ఇలా అతని వ్యాపారం వృద్ధి చెందుతూ కొన్నేళ్లలోనే ఒక పెద్ద మాల్ నిర్వహించే స్థాయికి వెళ్లాడు. చంద్రశేఖర్ మాత్రం జల్సాలకు 5లక్షలు కాజేసి బ్యాంకులకు వాయిదాలు కట్టకపోయే సరికి వాళ్ళు కారు లాక్కుపోవడంతో కాళ్ళకు చెప్పులు కూడా లేకుండా తిరగసాగాడు.

ఇది ఒక చిన్న కథ కావచ్చు. కాని, జీవిత సత్యం. మనం ఒకరి నుండి రూపాయి అప్పు తెచ్చుకున్నామంటే దాంతో రెండు రూపాయలు సంపాదించగలిగేలా వుండాలి. అలా సంపాదిస్తేనే అప్పు ఇచ్చిన వాళ్ళకు తిరిగి తీర్చగలం. అమరావతి రాజధాని నిర్మాణానికి అప్పులివ్వండంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను కోరడం చూస్తుంటే పైకథ గుర్తుకు రాక మానదు. అమరావతి రాజధాని అన్నది ఎంతమందికి ఉపయోగపడుతుంది... ఎంత ఆదాయాన్ని పెంచుతుంది? ముఖ్యమంత్రి, మంత్రులు వుండే విలాసవంతమైన భవనాలు కట్టడానికి ప్రజలు అప్పులివ్వాలా? అసలు రాజధానితో ఈ రాష్ట్రంలో ఎంతమందికి పని వుంటుంది. 175మంది ఎమ్మెల్యేలు, 50మంది ఎమ్మెల్సీలు, కొన్ని వేలమంది ఉద్యోగులు... ప్రస్తుతం రాజధాని వీరికే అవసరం. ముందు అక్కడ పరిపాలన సాగడానికి భవనాలు కట్టుకుంటే చాలు. అంతేగాని 50వేల ఎకరాలలో పచ్చటి పంటలు నాశనం చేసి ఇంద్రభవనాలు కట్టాల్సిన పనిలేదు. అయినా కూడా రాజధాని నిర్మాణానికి ప్రజలు అప్పులివ్వడమేంటి? రాజధాని నిర్మాణానికి కేంద్రమే నిధులివ్వాలి, కేంద్రం ఏపికి తగ్గ రాజధాని కట్టుకోమంటే చంద్రబాబు మాస్కో, టోక్యో, బీజింగ్‌లాంటి రాజధానికి స్కెచ్ వేసాడు. కేంద్రం రాజధాని కట్టుకోండంటూ ఇచ్చిన నిధులు ఈయన స్కెచ్‌లు, విదేశీ పర్యటనలకే సరిపోయాయి. కేంద్రం ఇచ్చిన నిధులకు లెక్కలు చెప్పకపోయేసరికి రాజధాని నిర్మాణానికి వాళ్ళు నిధులు ఆపేసారు.

అప్పులు చేసి రాజధాని కట్టడం అవసరమా? ఆర్భాటపు రాజధాని అవసరమా? ఇదేలా వుందంటే అప్పుచేసి పప్పు కూడు అన్నట్లుగా వుంది. ఒకవేళ విధిలేని పరిస్థితుల్లో ప్రజల నుండి అప్పులు తీసుకుంటే ఆ నిధులను ఏ సాగునీటి ప్రాజెక్టులకో ఖర్చు చేయాలి. దీనివల్ల సాగు విస్తీర్ణం పెరిగి వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతాయి. తద్వారా రాబడి పెరుగుతుంది. పెద్దపెద్ద భవనాలు కట్టుకుని ఏసీల్లో కూర్చుంటే ఆదాయం ఎలా వస్తుంది.

ఒకవేళ ప్రజలు అప్పులే ఇస్తారు. ప్రభుత్వం బాండ్లు ఇస్తుంది. వారికి తిరిగి చెల్లించే గ్యారంటీ ఏమిటి? తర్వాత చంద్రబాబు ప్రభుత్వం వస్తుందన్న గ్యారంటీ లేదు. రేపొచ్చే ప్రభుత్వం ఆర్భాటపు రాజధానిని పట్టించుకోక, అప్పుల క్రింద ఇచ్చిన బాండ్లను పరిగణనలోకి తీసుకోకపోతే పరిస్థితి ఏంటి?

కాబట్టి అప్పుచేసి ఇల్లు కట్టొద్దని పెద్దలెప్పుడో చెప్పారు. అప్పులు చేసి సింగపూర్ లాంటి రాజధాని కట్టాల్సిన అవసరం ఎంతమాత్రం లేదు. అది అంత అర్జెంట్ కూడా కాదు. తాత్కాలికంగా కట్టిన ఆ ఉరుస్తున్న భవనాలలోనే రాష్ట్ర పరిస్థితులు గాడిలో పడేంతవరకు పరిపాలన సాగిస్తే చాలు. బాబు గొప్పలకుపోయి అప్పులుచేస్తే ప్రజలకు తిప్పలు తప్పవు.


ఆడిటర్ ప్రస్థానం... 40 Years శుభాకాంక్షలు



శ్రీకంటి రామమోహన్‌రావు గారు, B.Com., F.C.A., D.I.S.A
చార్టెడ్ అకౌంటెంట్, గూడూరు.
సేవాతత్పరులు, సౌమ్యులు,
మా అందరికి ఆప్యాయత,
ప్రేమానురాగాలను పంచి,
మా ఉజ్వల భవిష్యత్తుకు
బంగారు బాటలు వేసిన మా నాన్న గారు
శ్రీకంటి రామమోహన్‌రావు గారు
ఆడిటర్‌గా 40 సంIIలు పూర్తిచేసుకున్న
శుభ సందర్భంగా మా హృదయపూర్వక
శుభాకాంక్షలు.
భార్య : శ్రీమతి పి.ఎస్. రాజ్యలక్ష్మి
కుమార్తె : శ్రీమతి ఎస్.వి. మంజుప్రీతి
అల్లుడు : డి. కామేశ్వర్
మనుమడు : ఆర్యన్
కుమారుడు : ఎస్.వి.ఎస్. మనోజ్‌కుమార్
కుమార్తె : ఎస్.వి.ఎన్. మహేశ్వరి
ఆనిమెళ్ళ శివకుమార్, ఉపాధ్యక్షులు
గూడూరు బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య
మరియు సీనియర్ జర్నలిస్ట్ సంఘ నాయకులు



## ఆ పంచాయితీలు
# మున్సిపాల్టీలయ్యేదెప్పుడు?

జిల్లాలో నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు కావలి, గూడూరు, వెంకటగిరి, సూళ్ళూరుపేట, ఆత్మకూరు మున్సిపాల్టీలుగానూ, నాయుడుపేట నగర పంచాయితీగాను వున్నాయి. జిల్లాలో మరికొన్ని మేజర్ పంచాయితీలను మున్సిపాల్టీలుగా మార్చాలని, పట్టణాల సొగసులు తీసుకురావాలని ఈ ప్రభుత్వంలోనే ప్రతిపాదనలొచ్చాయి. జిల్లాలో కొత్తగా మున్సిపాల్టీలను ఏర్పాటు చేయాలనుకున్నవాటిలో కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, అల్లూరు, వింజమూరు, కోట, పొదలకూరు, ఉదయగిరిలు వున్నాయి. బుచ్చి, కోవూరు, వింజమూరు, పొదలకూరు గ్రామాలు రోజురోజుకూ విస్తరిస్తున్నాయి. ఈ పట్టణాలలో జనాభా పెరుగుతోంది. వీటిలో వ్యాపార వాణిజ్య కేంద్రాలు విస్తారంగా వెలుస్తున్నాయి. విద్యాసంస్థలు, వైద్య సంస్థలు వెలుస్తున్నాయి. కోట, అల్లూరు, వింజమూరు, ఉదయగిరి, పొదలకూరు వంటి మేజర్ పంచాయితీలను మున్సిపాల్టీలుగా మార్చి, వాటి అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకదృష్టి పెట్టాల్సి వుంది. ఎందుకంటే జిల్లాలో ఇవి ఒక్కో దిక్కులో ఒక్కో మారుమూల వున్నాయి. ఇవి పట్టణాలుగా అభివృద్ధి చెందితే వాటి చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు చీటికి మాటికి నెల్లూరుకు పరుగులు తీయాల్సిన అవసరం వుండదు. ఆ పట్టణాలలో ఆసుపత్రులు, విద్యాసంస్థలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తే ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. నెల్లూరు నగరానికి వలసలు తగ్గుతాయి. మున్సిపల్ మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా మన జిల్లావాసి నారాయణే వున్నాడు. ఆయన తలచుకుంటే వచ్చే స్థానిక ఎన్నికలలోపు ఈ మేజర్ పంచాయితీలను మున్సిపాల్టీలుగా మార్చడం పెద్ద సమస్య కాదు.

## జిల్లాలో...
# జనసేనకు సైన్యమేది?

మెగాస్టార్ చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ పెట్టినప్పుడు నెల్లూరుజిల్లాలో ఆ పార్టీకి చెప్పుకోదగ్గ నాయకులు కొందరున్నా వున్నారు. ప్రజారాజ్యం పార్టీని పెట్టిన కొత్తల్లో బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మేరిగ మురళి, ఆనం వెంకటరమణారెడ్డి, సి.వి.శేషారెడ్డి వంటి నాయకులున్నారు. కనీసం పార్టీకి గుర్తింపన్నా వుండింది. 2009 ఎన్నికల్లో ఆ పార్టీకి పది చోట్ల అభ్యర్థులు దొరికారు. ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో నువ్వా-నేనా అన్న రీతిలో పోటీ ఇవ్వడమే కాకుండా నెల్లూరు నగర నియోజకవర్గంలో ఆ పార్టీ అభ్యర్థి గెలుపొందారు. ఆ ఎన్నికల తర్వాత ప్రజారాజ్యం కాంగ్రెస్‌లో కలిసిపోవడం తెలిసిందే! ఇప్పుడు పవన్ కళ్యాణ్ స్థాపించిన జనసేనకు అంత సీన్ వుందా? అన్నది ప్రశ్న! నెల్లూరుజిల్లాలో జనసేన ఉనికి నామ మాత్రమే. ఈ జిల్లాలో ఆ పార్టీకి దిక్కు మొక్కు లేదు. పవన్ అభిమానులు తప్పితే ఆ పార్టీకి సంబంధించి కేడర్ వున్న నాయకులెవరూ లేరు. ఈమధ్య మాజీఎమ్మెల్సీ మాదాసు గంగాధరం జనసేనలో చేరాడు. ఆయన ఊర్లోనే ఆయనకు ఓట్లు పడవు. రేపటి ఎన్నికలప్పుడు కూడా ఆ పార్టీలోకి నాయకుల వలసలు వండవు. ఆ పార్టీ తరఫున పోటీ చేస్తే డబ్బు దండగ ఖర్చు తప్పితే ఇంకోటి వుండదు. ఈ సంగతి నాయకులకు తెలుసు. కాబట్టే జనసేన వైపు తొంగి కూడా చూడడం లేదు.

# సాఫీగా దళితుల బంద్




ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంలో సవరణలు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై దళిత సంఘాలు భగ్గుమన్నాయి. సుప్రీం కోర్టును నిరసిస్తూ దళిత సంఘాలు నిర్వహించిన భారత్ బంద్ 2వ తేదీ నెల్లూరుజిల్లాలోనూ విజయవంతమైంది. దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఉదయం 7గంటల నుండే బంద్ హడావిడి కనిపించింది. దళిత సంఘాల నాయకులు మోటార్ సైకిళ్ళపై తిరుగుతూ బంద్‌ను పర్యవేక్షించారు. నెల్లూరులోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో జరిగింది. దాదాపు గంటసేపు బస్టాండ్‌లో నుండి బస్సులు బయటకు రాలేదు. దళిత, గిరిజన సంఘాల నాయకుల పెద్దసంఖ్యలో బంద్‌లో పాల్గొన్నారు.

# రామ్మోహన్‌రావు సేవలు అభినందనీయం

**- బ్రాహ్మణ సేవాసంఘ ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ళ శివకుమార్**



ఆడిటర్‌గా 40ఏళ్ళు పూర్తి చేసుకున్న రామ్మోహన్‌రావు దంపతులకు అభినందనలు తెలుపుతున్న గూడూరు బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్

వృత్తి పట్ల అంకితభావం ఉండటం వల్లే శ్రీకంటి రామ్మోహన్‌రావు 40ఏళ్ళు ఆడిటర్‌గా పూర్తి చేసుకొని మంచి గుర్తింపు పొందుతున్నారని గూడూరు బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య గూడూరు శాఖ ఉపాధ్యక్షులు, సీనియర్ జర్నలిస్టు సంఘ నాయకులు ఆనిమెళ్ళ శివకుమార్ అన్నారు. 1వ తేదీ గూడూరు ఎస్వీ రత్నం ట్రస్ట్ కార్యాలయంలో సీనియర్ ఆడిటర్ మరియు గూడూరు బ్రాహ్మణ సేవా సంఘ గౌరవాధ్యక్షులు శ్రీకంటి రామ్మోహన్‌రావు, సతీమణి రాజ్యలక్ష్మిలకు బ్రాహ్మణ సేవా సంఘ ఉపాధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్ పూలమాల, పుష్పగుచ్చం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆడిటర్ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ స్నేహితులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, ఖాతాదారుల సహకారంతో గూడూరులో ఆడిటర్‌గా 40ఏళ్ళు పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. ఆడిటర్‌గా సేవలు అందించడంలో తనకు సహకరించిన దరికి కృతజ్ఞతలు తెలిపారు. గూడూరు బ్రాహ్మణ సేవాసంఘ ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ళ శివకుమార్ మాట్లాడుతూ ఆడిటర్ రామ్మోహన్‌రావు మంచి వ్యక్తి, సౌమ్యులుగా పేరు తెచ్చుకొని గూడూరు పట్టణంలో పలువురు మన్ననలు పొందారన్నారు. ఎస్వీ రత్నం ఛారిటీస్ తరపున పేద విద్యార్థులకు చదువులకు సహాయం, పట్టణంలో సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. పదిమందికి మేలు చేయాలనే తపన ఉన్న రామ్మోహన్‌రావు వృత్తిపరంగా మంచి పేరు సంపాదించారన్నారు. అనంతరం శ్రీకంటి రామ్మోహన్‌రావు, సతీమణి రాజ్యలక్ష్మి ఆడిటర్లుగా 40ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంచారు. అనంతరం సీనియర్ న్యాయవాది, బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడులు వై.చలపతి రావు, కోడూరు మీరారెడ్డి, సోమిశెట్టి చెంచురామయ్య, వి.వెంకటసుబ్బయ్య, శేగు ప్రసాదరావు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇంకా వారి సిబ్బంది మల్లి శ్రీనివాసులు, ఎండి హమీద్, ఎమ్.చంద్రశేఖర్, టి.శాంతి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## నారాయణలో ప్రాంగణ ఎంపికలు



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపక బృందం

విద్యార్థులు విషయ పరిజ్ఞానంపై పట్టు ఉన్నప్పుడే కొలువులు సాధిస్తారని నారాయణ కళాశాల మేనేజ్‌మెంట్ సెక్రటరీ వినయకుమార్ తెలిపారు. గూడూరు పట్టణం నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ సివిల్, మెకానికల్ చదువుతున్న విద్యార్థులకు ఏక్యురేట్ స్టీల్ ఇండియా లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ప్రాంగణ ఎంపికలను నిర్వహించి 17మందిని ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.1.80లక్షలు అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పరమేశ్వరరావు, కళాశాల డైరెక్టర్ ఏవీఎస్ ప్రసాద్, ప్లేస్‌మెంట్ అధికారి ఖాదర్ తదితరులు ఉన్నారు.

## ఇంజనీరింగ్ విద్యార్థికి ఆర్థిక సాయం

ఎన్‌బికెఆర్‌లో బిటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న షేక్ నఫీస్‌కు 5వేల రూపాయలు ఆర్థిక సాయాన్ని గూడూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షులు మరియు మాజీ మండల ఉపాధ్యక్షులు నెలబల్లి భాస్కర్‌రెడ్డి అందించారు. ఇంకా పేద విద్యార్థులకు ఏదైనా సహాయం కావాలంటే చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గురుగుహ, జిలాని తదితరులు పాల్గొన్నారు.

## కొత్త ఎస్సైల బాధ్యతల స్వీకరణ



ఒకటో పట్టణ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన శేఖర్‌బాబు

గూడూరు ఒకటో పట్టణ ఎస్సైగా కె.శేఖర్‌బాబు ఈ నెల 2వ తేదీ ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్సై సుధాకర్‌పై పలు ఆరోపణలు రావడంతో జిల్లా ఎస్పీ సస్పెండ్ చేశారు. తాజాగా నెల్లూరు గ్రామీణ ఎస్సైగా పనిచేస్తున్న శేఖర్‌బాబు గూడూరు ఒకటో పట్టణ ఎస్సైగా నియమితులయ్యారు. గూడూరు రెండో పట్టణ ఎస్సైగా హుస్సేన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్సై నరేష్ ఆత్మకూరుకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో విఆర్‌లో ఉన్న హుస్సేన్‌ను రెండో పట్టణ ఎస్సైగా ఎస్పీ అటాచ్ చేశారు.

## విజిలెన్స్ దాడులు

గూడూరు పట్టణంలోని నలజాలమ్మ వీధిలో అక్రమంగా గ్యాస్ సిలిండర్ల నిల్వలు ఉన్న ఓ గృహంపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆధ్వర్యంలో ఈ నెల 2వ తేదీ విస్తృతంగా దాడులను నిర్వహించారు. విజిలెన్స్ సి.ఐ ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో వీటిని చేపట్టారు. నలజాలమ్మవీధిలో నరసింహులు అనే వ్యక్తి అక్రమంగా గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో దాడులు చేయగా 24 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. గృహానికి వినియోగించే సిలిండర్లను దుకాణాలకు అధిక ధరలకు విక్రయిస్తూ పక్కదారి పట్టిస్తున్నట్లుగా అధికారులు నిర్ధారించారు. ఈమేరకు గ్యాస్‌సిలిండర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేసి వ్యక్తిపై కేసు నమోదు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ విజయకుమార్, సిబ్బంది వాసు, మోహన్ ఉన్నారు.

# అమరావతిని చూసి ఆశ్చర్యపోయిన శ్రీరాముడు

శ్రీను గల్పిక

అది వైయస్సార్ జిల్లాలోని ఒంటిమిట్ట కోదండరామస్వామి దేవాలయం. బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. మార్చి 30వ తేదీ కళ్యాణోత్సవం కావడంతో ముఖ్యమంత్రి, హైటెక్‌రత్న, పాతిక ప్రపంచ మేటి నగరాలను ప్రపంచానికి ఒకే నగరంలో చూపించడానికి కృషి చేస్తున్న అమరావతి రాజధాని రూపశిల్పి చంద్రబాబునాయుడు పట్టువస్త్రాలు పట్టుకుని కుటుంబసభ్యులతో కలిసి దేవాలయంలోకి అడుగుపెట్టాడు. అంతే... ఆ క్షణంలోనే ఆకాశంలో పెద్ద ఉరుములు, కళ్ళు మిరుమిట్లు గొలిపే మెరుపులు... క్షణాల్లో ఈదురుగాలులు, పెద్ద పెద్ద వడగండ్లు... పది నిముషాలలో పెనువిధ్వంసం... పందిళ్ళు కూలిపోయాయి. స్థంభాలు పడిపోయాయి. అక్కడ వాతావరణం చెల్లాచెదురైంది. అప్పుడే సిబిఎన్ ఛానెల్ వాళ్లొచ్చారు. అక్కడ జరిగిన సంఘటనలను ప్రత్యక్ష ప్రసారం చేస్తూ... రిపోర్టర్ గ్యాస్ గన్నారావు స్టూడియోలో వున్న పుకార్ల పాపారావుతో... సార్ ఈరోజు రాష్ట్రానికెంతో శుభదినం... ఇదో అద్భుత మహిమాన్వితం... చరిత్రలో ఓ అపురూప ఘట్టం... మన ప్రియతమ ముఖ్యమంత్రి దేవాలయంలోకి అలా అడుగుపెట్టాడో లేదో ప్రకృతి పరవశించిపోయింది. వరుణుడు పులకించి వర్షపు ధారలను కాకుండా ఏకంగా వడగండ్లనే కురిపించాడు. అగ్ని దేవుడు ఉరుములు, మెరుపుల రూపంలో తన ఆశీస్సులందజేశాడు. వాయు దేవుడు ఈదురుగాలుల రూపంలో తన హర్షం ప్రకటించాడు. ఇలా రాములోరి కళ్యాణానికి చంద్రబాబు అడుగుపెట్టగానే సకల దేవతలు ప్రత్యక్షమై ఆనందాన్ని ప్రకటించారు పాపారావు... అని చెప్పాడు. ఈ అద్భుత సంఘటనపై శ్రీరాముడు, సీతాదేవిల స్పందన ఏంటో కనుక్కోలేకపోయారా గున్నారావుగారు అని స్టూడియో నుండి పాపారావు అడిగాడు. దానికి గున్నారావు... సీతారాములు షాక్‌లో వున్నారు. చంద్రబాబు పాదానికి ఇంత మహత్యం వుందా అని వాళ్ళే ఆశ్చర్యపోతున్నారు... 'ఈ పాదం దివ్యపాదం ఈ పాదం మహిమపాదం' అని పాట పాడి.. ఇట్లు కెమెరాఉమెన్ మంగతో గ్యాస్ గన్నారావ్ అని చెప్పి ముగించాడు. కళ్యాణోత్సవం ముగిసాక చంద్రబాబు అమరావతికి వెళ్ళిపోయాడు. ఉండవల్లిలోని తన నివాసంలో కూర్చుని టీవీ ఆన్‌చేసి తనకిష్టమైన 'ఆత్మసాక్షి' ఛానెల్ పెట్టాడు. స్క్రీన్‌పై రోజా కనిపించింది. చంద్రబాబు గుండె కలుక్కుమంది. రోజా మాట్లాడుతూ... మీరే చెప్పండి ఐరన్‌లెగ్ ఎవరిదో... చంద్రబాబు ఒంటిమిట్టలో అడుగుపెట్టగానే పెనువిధ్వంసం జరిగింది. ఐదుమంది చనిపోయారు. 60మంది గాయపడ్డారు. ఈయన గోదావరి పుష్కరాలలో అడుగుపెట్టినప్పుడు పాతిక మంది చనిపోయారు. ఆయన చేత కళ్యాణం చేయించుకోవడం ఆ రాముడికీ ఇష్టం లేదు. ఒరిజినల్ ఐరన్‌లెగ్ ఆయనదే అంటూ దుమ్మెత్తి పోయసాగింది. అది చూసి చంద్రబాబుకు బాధేసింది. వెంటనే పూజామందిరం వద్దకు వెళ్ళి... "రామయ్య తండ్రి ఓ రామయ్య తండ్రి, దేవుడంటే నువ్వేలే రామయ్య తండ్రి" అంటూ పాటందుకున్నాడు. పాట ప్రారంభలో ఉండగానే రాముడు, సీతా లక్ష్మణ హనుమత్సమేతంగా ప్రత్యక్షమయ్యాడు. వారిని చూసి చంద్రబాబు... నా పాట పూర్తికాకుండానే భలే ప్రత్యక్షమయ్యారే స్వామి అని అడిగాడు. పాట పూర్తిగా వినే శక్తి మాకు లేదు నాయనా... పాట పూర్తిగా వింటే మా హనుమంతుడు కుప్పిగంతు లేస్తాడని చెప్పి ముందుగానే ప్రత్యక్షమయ్యాను. ఇంతకూ అంత మధురంగా పాటెందుకు పాడావు నాయనా అని రాముడు అడిగాడు. ఈరోజు ఒంటిమిట్టలో అలా ఎందుకు జరిగింది స్వామీ... నేనేం తప్పు చేసాను అని చంద్రబాబు ప్రశ్నించాడు. అందుకు రాముడు... ఈ ప్రశ్నకు నేను తర్వాత సమాధానం చెబుతాను. ముందు నాకు అమరావతి రాజధాని చూపించు... చాలా అద్భుతంగా కట్టారట కదా... ఈ విశ్వంలోనే అటువంటి నగరం లేదని మా దేవలోకంలో టాక్... ఇంద్రుడు కూడా తన అమరావతి నగరం మొత్తాన్ని పగలగొట్టి మీ అమరావతిలాగానే కట్టుకోవాలనుకుంటున్నాడట... అని అడిగాడు. దానికి చంద్రబాబు అలాగే అని చెప్పి వారిని తన కారెక్కించుకుని బయలుదేరాడు. ఒక చోట ఆపాడు. అందరూ క్రిందకు దిగారు. అక్కడ దాదాపు వందమంది దాకా వున్నారు. వారందరి కళ్ళకు నల్ల కళ్లద్దాలున్నాయి. మంత్రులు పి.నారాయణ, నారా లోకేష్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, దేవినేని ఉమా మహేశ్వరరావులు అక్కడ నిలబడి వారందరికీ... ఇదే అద్భుత అమరావతి రాజధాని... అదిగో సైబర్ టవర్స్... ఆకాశాన్ని తాకుతున్నాయి చూడండి... అది ఫైబర్ టవర్స్... ఆ రెండు వందల అంతస్తుల భవనం చూసారా? అదే ట్రేడింగ్ సెంటర్. ప్రపంచంలోనే ఇంత ఎత్తైన భవనం లేదు. మనం ఎదురుగా చూస్తున్నది ఎన్టీఆర్ ఎక్స్‌ప్రెస్ హైవే... అది 16లైన్ల రోడ్డు. అదిగో ఆ పట్టిసీమ నదిలో స్టీమర్లు చూసారా... అవి వివిధ దేశాల నుండి నేరుగా ఇక్కడికే వస్తాయి. అమరావతిని చూడడానికి విదేశీ పర్యాటకులు రావడానికి అనువుగా నేరుగా అమరావతికే జల మార్గాన్ని నిర్మించాము. ఆ దూరాన కనిపించేది ఫిలిం సిటీ. దీనిముందు హాలీవుడ్ స్టూడియో కూడా పనికి రాదు. అక్కడ విమానాలు వరుసపెట్టి దిగుతున్నాయి చూసారా అదే ఎయిర్‌పోర్టు. అదిగో బుల్లెట్‌లా దూసుకుపోతుంది చూసారా అదే బుల్లెట్ ట్రైన్... అని పర్యాటకులకు మంత్రులు దగ్గరుండి చెబుతున్నారు. వాళ్ళు చెబుతున్నవేవీ అక్కడ శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, హనుమంతుడులకు కనిపించలేదు. శ్రీరాముడు అదే డౌట్‌ను చంద్రబాబు ముందు వ్యక్తం చేశాడు. అద్భుత రాజధాని అంటున్నారు... అది ఇది అంటున్నారు. మాకు ఇక్కడ బీడు పడ్డ నేల తప్పితే ఇంకేమీ కనిపించడం లేదని అన్నాడు. అందుకు చంద్రబాబు... అమరావతి రాజధానిని కళ్ళతో చూడకూడదు. కలల్లో చూడాలి, మనసుతో చూడాలి. కళ్ళు మూసుకుని మనసులో 'ఓం అమరావతాయనమః' అనుకోండి... ఈ రాజధాని మీకు అద్భుతంగా కనిపిస్తుందని చెప్పాడు. శ్రీరాముడు, మిగతా ముగ్గురు అలాగే కళ్ళు మూసుకుని మంత్రం చదివారు. ఈలోపు మంత్రి పి.నారాయణ తెచ్చిన స్పెషల్ నల్లకళ్ళజోళ్ళను ఆ నలుగురి కళ్ళకు పెట్టారు. వాళ్ళు కళ్ళు తెరిచారు. అంతే వారి కళ్ళకు అద్భుత భవనాలు, విశాలమైన రహదార్లు, అందమైన బృందావనాలు, ఎయిర్ పోర్టులు, ఐటి పార్కులు... వాటిని చూస్తూ శ్రీరాముడు అద్భుతం, అపూర్వం... ఇది ఎలా సాధ్యమైంది అని అన్నాడు. చంద్రబాబు వెంటనే శ్రీరాముడి కళ్ళకున్న అద్దాలను తీసి ఇలా... అని అన్నాడు. అంతే రాముడి కళ్ళకు మళ్ళీ బీడుబారిన నేలే కనిపించసాగింది. ఏంటి చంద్రబాబు ఇదంతా అని రాముడు అడిగాడు. నేను ఊహించిన రాజధాని కట్టాలంటే ఎన్ని యుగాలు పడుతుందో తెలియదు. అందుకే ఈ త్రీడీ ఎఫెక్ట్ గ్లాస్‌ను ప్రత్యేకంగా చేయించాను. నా ఊహల అమరావతి అంతా కూడా ఈ గ్లాస్‌లలో పెట్టించాను. ఇది పెట్టుకుని చూస్తే అమరావతి చాలా అందంగా కనిపిస్తుంది. మా మీడియా వాళ్ళకు కూడా ఇవే గ్లాసులు పెట్టి అమరావతిని చూపించాను. వాళ్ళు అదే లోకంలో వున్నారు. ఇప్పుడు చెప్పండి... నా అమరావతి ఎలా ఉంది? అని చంద్రబాబు అడిగాడు. అప్పుడు రాముడు... ఇంతకుముందు నువ్వు అడిగావు కదా ఒంటిమిట్టలో అంత భీభత్సం ఎందుకు జరిగిందని... ఇలాంటి పనులు చేస్తుంటే అలాంటి ఉపద్రవాలే వస్తాయి నాయనా అని చెప్పి నా టైం వేస్ట్ చేసావంటూ తన టీమ్‌తో సహా మాయమయ్యాడు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

అనుకున్న పనులు సవ్యంగానే జరుగుతుంటాయి. ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారికి అవకాశాలు బాగుంటాయి. గృహ, వస్తు, వాహన రిపేర్లుంటాయి. స్థాన మార్పుంటుంది. ఉన్నత విద్యలో కృషి బాగా చేస్తారు. ముఖ్యమైన పత్రాలు వస్తువులు జాగ్రత్త. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఆదాయము సామాన్యము. వృత్తి వ్యాపారాలు ఒక మోస్తరుగా ఉంటాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

విద్యార్థులకు చదువుపై కంటే ఇతర విషయాలలో వ్యాపకం పెరుగుతుంది. సొంత పనులు జరుగుతున్నా టెన్షన్ పడుతుంటారు. మిత్రులు, కుటుంబసభ్యుల కొరకు ఎక్కువ ఖర్చుపెడతారు. ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ అవకాశాలు దొరుకుతాయి. సహచరులతో చిన్న మనస్పర్ధలుండగలవు. ఉద్యోగ, వృత్తులందు పనిభారం ఎక్కువ. శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత కలదు.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

శుభకార్యాలు నిర్ణయం కావడం, దూర ప్రయాణాలు ఖరారు కాగలవు. షేర్లు పెట్టుబడులందు లాభాలుంటాయి. ప్రభుత్వ పరంగా అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ అవకాశాలు బాగుంటాయి. మిమ్మల్ని కాదనుకున్న వారు మరల చేరువ కాగలరు. ఆర్థికంగా బాగుండి, ఆదాయం పెరుగుతుంది. ఆస్థి సమస్యలు పరిష్కారానికి రాగలవు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

షేర్లు, స్థిరాస్తుల మీద లాభాలుంటాయి. కొన్ని సొంత పనులకు ఆటంకాలు కలిగి తొలుగుతాయి. విద్యార్థులకు చదువులో ప్రగతి ఉంటుంది. స్థిమితంగా ఉండలేరు. టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. వృత్తిపరంగా గుర్తింపు, వ్యాపార పరంగా అభివృద్ధి బాగుంటుంది. ఆదాయం పెరుగుతుంది. ఆర్థిక ఒప్పందాలు, లావాదేవీలందు వ్యవహారం జాగ్రత్తగా నిర్వహించండి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

మీ అభిప్రాయాలకు, ఆలోచనలకు మంచి విలువ ఉంటుంది. దూర ప్రయాణాలుంటాయి. కుటుంబ వ్యక్తులకు భిన్న ఆలోచనలున్న కారణంగా సర్దుకొని పోవలసి ఉంటుంది. ఆరోగ్యం, ఆహార విషయాలలో జాగ్రత్తగా మెలగండి. అనుకున్న పనులు నెమ్మదిగా జరుగుతాయి. ఆస్థి వ్యవహారాలు, ఋణాల విషయాలలో జాగ్రత్తగా వ్యవహరించండి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

తొందరపాటు నిర్ణయాలు తీసికొనవద్దు. ఆత్మీయులతో చర్చించండి. వ్యాపారులకు ఆర్థికావకాశాలు చేజారిపోవచ్చును. ఆశించినంత ప్రయోజనాలుండవు. తలపెట్టిన పని సరిగా జరగక నిరుత్సాహంగా ఉండడం, కోపం పెరగడం ఉంటుంది. బిల్లులు, చెల్లింపుల వత్తిడి ఎక్కువగా ఉంటుంది. క్రొత్త వస్తువులు కొంటారు. స్థాన మార్పులనే ఆలోచన కలుగుతుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి – మీ వాసి

తేది. 6.4.2018 నుండి
తేది. 12.4.2018 వరకు

ఈ వారం మేషంలో శుక్రుడు, కర్కాటకంలో రాహువు, తులలో గురువు, ధనుస్సులో శనికుజులు, మకరంలో కేతువు, మీనంలో రవిబుధులు, వృశ్చిక ధనుస్సు మకర కుంభ రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగము
తేది 11 బుధవారం ఉదయం గంట 6.0 నుండి గంట 7.30లోగా వ్యాపార ఉపనయన, గృహారంభ, వివాహములకు మేష లగ్నము.
రాత్రి గంట 6.30 నుండి గంట 8.40లోగా తులా లగ్నమున గృహ ప్రవేశ, వివాహములు

### చైత్ర మాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 6 | శుక్ర | షష్ఠి | రా॥ గం.8.45వ॥ |
| తేది. 7 | శని | సప్తమి | రా॥ గం.10.43వ॥ |
| తేది. 8 | ఆది | అష్టమి | రా॥ గం.12.46వ॥ |
| తేది. 9 | సోమ | నవమి | రా॥ గం.2.47వ॥ |
| తేది. 10 | మంగళ | దశమి | రా॥ గం. 4.37వ॥ |
| తేది. 11 | బుధ | ఏకాదశి | పూర్తిగ |
| తేది. 12 | గురు | ద్వాదశి | ఉ॥ గం.6.20వ॥ |
| | పిదప | త్రయోదశి | పూర్తిగ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

మంచి ఉన్నత విద్యావకాశాలు దొరుకుతాయి. ముఖ్యమైన పత్రాలు వస్తువులు జాగ్రత్త. గృహ మార్పులు గాని రిపేర్లు గాని ఉంటాయి. ఉద్యోగార్థులకు సంకేతాలు సుముఖంగా ఉంటాయి. కోర్టు వ్యవహారాలు, బంధువులతో గల విభేదాలు సర్దుబాటు కాగలవు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉండి ఆదాయం బాగున్నా ఖర్చులు పెరుగుతాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

క్రొత్తగా ఆహ్వానాలు అందుకొంటారు. విద్యావృద్ధికై గట్టి కృషి చేయవలసి వస్తుంది. క్రీడా శాస్త్ర సాంకేతిక కళా రంగాల వారికి మంచి అవకాశాలు దొరకగలవు. ఉద్యోగార్థులకు అవకాశాలు బాగుంటాయి. అనుకోని అదనపు ఖర్చులుంటాయి. ఆరోగ్యం, ఆహార విషయాలలో జాగ్రత్త అవసరం. ఆర్థికంగా పెరుగుదల ఉంటుంది. ఆదాయం పెరుగుతుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఉద్యోగులు అధికారులు, సహచరులతో జాగ్రత్తగా మెలగండి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. వివాదాస్పద విషయాలలో తల దూర్చకండి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. విద్యావృద్ధి కృషి బాగుంటుంది. స్టాక్ మార్కెట్ లాభాలనిస్తుంది. ఆస్థి వ్యవహారాలను కొంత వాయిదా వేసికొంటే మంచిది. ఆర్థిక ఇబ్బందులు క్రమంగా సర్దుబాటవుతాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

చెల్లింపులు సకాలంలో జరుపుతారు. ఏ రకమైన ప్రలోభాలకు మెత్తబడవద్దు. బంధువుల రాకపోకలుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది. స్థిరాస్తుల లావాదేవీలపై దృష్టిపెడతారు. కొత్త వ్యాపారాలకు పెట్టుబడులకు అవకాశాలు దొరుకుతాయి. మీ పనులు జరగడానికి బంధుమిత్రులు సహాయపడతారు. అనవసర వ్యవహారాలలో కలుగచేసికొనవద్దు. బాకీలు కొంత లభించగలవు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వృత్తి వ్యాపారాలలో ఆదాయం బాగుంటుంది. అనుకోని ప్రయాణాలుంటాయి. స్త్రీలు కొత్త వస్తువులు అందుకొనడం, కుటుంబ సమస్యలు సర్దుబాటు కావడం జరుగుతుంది. చదువులో పట్టుదల, కృషి చూపెడతారు. ఉద్యోగులు ఇతరుల నుండి వత్తిడులు, ధన ప్రలోభాలు ఎదుర్కొనవలసి వస్తుంది. చేపట్టిన ముఖ్య పనులకు ఆటంకాలు కలుగుతాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఋణాలు కొంత చెల్లించడం, అనవసర విషయాలలోనికి మిమ్మల్ని లాగడానికి ప్రయత్నిస్తారు జాగ్రత్త. ఉద్యోగ ప్రయత్నాలలో ఇంటర్వ్యూ అవకాశాలు దొరకవచ్చును. ఆరోగ్యం జాగ్రత్త. ఖర్చులు బాగా పెరుగుతాయి. ఆదాయం సామాన్యము. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు చేజారిపోవచ్చును. గతించిన విషయాలపై చర్చలుంటాయి. ఆర్థికంగా నిలద్రొక్కుకొనేందుకు కృషి చేస్తారు.

# కల్యాణ వైభవం...!



నెల్లూరుజిల్లాలో ఎస్.ఐగా, సి.ఐగా పలు ప్రాంతాల్లో సేవలందించి, ప్రస్తుతం ఏపి ఎస్ఆర్టిసి నెల్లూరు డిఎస్పీగా పని చేస్తున్న వై.జయరామసుబ్బారెడ్డి - శ్రీదేవిల కుమార్తె **డా॥ శ్వేత - డా॥ భరత్‌కుమార్** (వైయస్సార్ కడప జిల్లా, అనంతంపల్లి గ్రామ వాస్తవ్యులు దేసు రామసుబ్బారెడ్డి - రమాదేవిల కుమారుడు)ల కళ్యాణం ఈ నెల 1వ తేదీ నెల్లూరులోని పావని గార్డెన్స్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.



నెల్లూరులో ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్‌గా సుదీర్ఘకాలం పని చేసి ప్రస్తుతం హైదరాబాద్‌లో సాక్షి దినపత్రికలో సేవలందిస్తున్న ఆర్.ఎం.బాషా - జరీనాబేగంల కుమార్తె **సుష్మ సుల్తానా రజ - షేక్ కాలేషా** (నెల్లూరు వాస్తవ్యులు షేక్ బాషా - మస్తాన్‌బీల కుమారుడు)ల వివాహం మార్చి 29వ తేదీన నెల్లూరు కస్తూరిదేవి స్కూల్‌లోని రవీంద్రనాథ్ ఠాగూర్ భవన్‌లో జరిగింది. మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆళ్ళ రామకృష్ణారెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, కె.సంజీవయ్య, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, వైసిపి జిల్లా పరిశీలకులు సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు హాజరై కొత్తజంటను దీవించారు.

# వృద్ధులకు ఆర్యవైశ్య బులియన్ పింఛన్లు



ఆర్యవైశ్య వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న జిఎస్‌టి జాయింట్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

నెల్లూరులోని ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 5న వృద్ధులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ ఎస్ఇ కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొని, ఈ అసోసియేషన్ నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను కొనియాడారు. నిరుపేద వృద్ధులకు నెలనెలా పింఛన్లు పంపిణీ చేయడం ఎంతో అభినందనీయమని, ఈ పింఛన్లు వారికెంతో ఉపయోగపడతాయన్నారు. ఇంత మంచి కార్యక్రమం నిర్వహిస్తున్న అసోసియేషన్‌వారిని ఆయన ప్రశంసిస్తూ, తన ద్వారా వృద్ధులకు ఈ పింఛన్లు అందజేయించడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ నెల నుంచి అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న కార్యక్రమం స్ఫూర్తితో ముగ్గురు సభ్యులకు ఏడాదిపాటు 500 రూపాయల వంతున ఇస్తామని ఈ సందర్భంగా వాగ్దానం చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 53మంది వృద్ధులకు సాయంగా 500వంతున నగదు పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు అమరా మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎం.పి ఆంజనేయులు, కోశాధికారి శోభన్‌బాబు, ప్రోగ్రామ్ ఛైర్మెన్ ఎం. చంద్రశేఖర్‌లతో కమిటీ సభ్యులంతా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





గ్రంథం : హరికథా భిక్షువు
శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి అయ్యవారి
జీవన దర్శనం
రచన : ఎమ్మెస్ సూర్యనారాయణ
పేజీలు : 226 వెల : 200/-
ప్రతులు లభించు చోటు :
'లాయర్' వారపత్రిక కార్యాలయం. ఫోన్. 0861-2323485
వీరిశెట్టి హజరత్‌బాబు, సెల్: 98491 77522
వై.నాగదేవి ప్రసాద్, సెల్: 94401 64423
డా॥ ఎం.సుబ్రహ్మణ్యం, సెల్: 90528 58272


# నిప్పో.. కొన్నదే కాని... కొట్టేసింది కాదుగా!

***నెల్లూరుజిల్లాలో ప్రస్తుతం హాట్‌టాపిక్ నిప్పో ఫ్యాక్టరీ స్థలం. ఈ జిల్లాలో ఎటువంటి పారిశ్రామిక ప్రగతి లేని 1970 దశకంలోనే జపాన్‌కు చెందిన మిత్సుబిషి కంపెనీ భాగస్వామ్యంతో నెల్లూరు మరియు తడలలో ఇండోనేషనల్ లిమిటెడ్ పేరుతో నిప్పో బ్యాటరీ తయారీ పరిశ్రమలను స్థాపించి వేలాదిమంది కార్మికులకు ఆ పరిశ్రమలలో ఉపాధి కల్పించిన గొప్ప వ్యక్తి స్వర్గీయ పొట్టేపాటి ఓబులరెడ్డి. ఆ కాలంలోనే ఆయన ఎంతో దూరదృష్టితో ఆలోచించారు. 'నిప్పో' ఫ్యాక్టరీని నెల్లూరు నగరానికి ఒక ల్యాండ్‌మార్క్‌గా మార్చారు.***

నెల్లూరులో పరిశ్రమలను స్థాపించడానికి ఆయన భూమి కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోగా 1972నవంబర్ 27వ తేదీన జిఓఎంఎస్ నెంబర్ 1230 ద్వారా 11.74 ఎకరాలు, 1973 మే 25వ తేదీన 2.16 ఎకరాల భూమిని కేటాయించారు. అప్పట్లో అక్కడున్న మార్కెట్ రేటు ప్రకారమే ఎకరా 4,200రూపాయల లెక్కన కొన్నారు. 1970 ప్రాంతంలో ఇప్పుడు నిప్పో స్థలం వున్న ప్రాంతం నెల్లూరుకు చాలా దూరంలో ఉండేది. ఆ రోజు చుట్టుపక్కల పట్టా భూములు కూడా అంతకంటే ఎక్కువ ధర వుండేది కావు. ఆరోజు నిప్పో ఓబుళరెడ్డి పరిశ్రమను పెడతానని చెప్పి ప్రభుత్వం నుండి ఉచితంగా భూమిని తీసుకోలేదు. కనీసం రిజిష్టర్ రేటుకు కూడా తీసుకోలేదు. మార్కెట్ రేటుకే కొన్నాడు. ఆరోజు చుట్టుపక్కల వున్న భూముల ధరలు కూడా అంతే! కాలక్రమేణా నగరం విస్తరించింది. ప్రస్తుతం నగరం నిప్పో ఫ్యాక్టరీని కూడా దాటిపోయింది. నగరం విస్తరించడం, రియల్ ఎస్టేట్ బూమ్ వంటి పరిణామాల వల్ల 'నిప్పో' ప్రాంతంలో స్థలాలకు విపరీతమైన రేట్లొచ్చాయి. నిప్పో స్థలం అప్పటి నుండి ఒకే యాజమాన్యం క్రింద వుంది. ఆ చుట్టుపక్కల అంటే వేదాయపాలెం, చంద్రమౌళినగర్, ఏ.కె.నగర్, కరెంట్ ఆఫీస్ సెంటర్ ప్రాంతాలలో ప్రైవేట్ వ్యక్తులు తమ భూములను 1970 నుండి అమ్ముకుంటూ వచ్చారు. ఇలా ఎకరాలు పోయి అంకణాలలోకి వచ్చేసరికి ఈ కాలానికి అంకణం 2లక్షల నుండి 7లక్షల దాకా అయ్యింది. ఎకరా లెక్క అయితే 8కోట్ల పైమాటే! 'నిప్పో' యాజమాన్యానికి చెందిన 13.90 ఎకరాలకు ఖరీదు కడితే దాని విలువ వంద కోట్లకుపైనే వుంటుంది.

ఇప్పుడు నిప్పో స్థలంపై వివాదం జరగడం చూస్తూనే వున్నాం. చుట్టుపక్కల నగరం విస్తరించిన నేపథ్యంలోనైతేనేమీ, బ్యాటరీల మార్కెట్‌లో వచ్చిన ఒడిదుడుకుల వల్లనైతేనేమీ, పెరిగిన కాలుష్యం వల్లనైతేనేమీ ఫ్యాక్టరీని తీసేయాలనుకుంటున్నారు. ఈ స్థలాన్ని పారిశ్రామిక జోన్ నుండి గృహ, వాణిజ్య వినియోగజోన్‌గా మార్చమని నిప్పో యాజమాన్యం ప్రభుత్వాన్ని కోరింది. దీనిపై ఒకటికి రెండుసార్లు కౌన్సిల్ చర్చ జరిగింది. అయితే కొందరు నాయకులు దీనిపై వివాదం చేస్తున్నారు. 'నిప్పో' ఫ్యాక్టరీ భూములు ప్రభుత్వానివని, అక్కడ ఫ్యాక్టరీని తీసేస్తే స్థలాన్ని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, ఆ స్థలంలో పేదలకు ఇళ్ళు, గుళ్ళు, మసీదులు, చర్చిలు, కమ్యూనిటి హాళ్ళు కట్టించాలని కొందరు నాయకులు డిమాండ్ చేస్తున్నారు.




నిప్పో స్థలం ఏ నిబంధనల క్రింద ప్రభుత్వం ఇచ్చిందన్నది ఇక్కడ ప్రధాన అంశం! ప్రభుత్వం మార్కెట్ రేటుకు భూములను అమ్మినప్పుడు కొనుగోలుదారులకు పూర్తి హక్కు వస్తుంది. ఆరోజు ప్రభుత్వం నుండి కాకుండా ఓబుళరెడ్డి ప్రైవేట్ వ్యక్తుల నుండి పట్టాభూములు కొనివున్నా అదే రేటు... ఈరోజు అసలు గొడవే వుండేది కాదు. పరిశ్రమ పెడుతున్నాడు కాబట్టి ప్రభుత్వం తక్కువ ధరకు ఆ భూమిని ఇచ్చివున్నా లేదా ఇన్ని సంవత్సరాలు అని లీజును నిర్ణయించివున్నా దానిపై నిప్పో యాజమాన్యానికంటే ప్రభుత్వానికే ఎక్కువ హక్కుంటుంది.

రాష్ట్రంలో ఎన్నో ప్రైవేట్ కంపెనీలకు, విద్యాసంస్థలకు, అంతెందుకు పత్రికా కార్యాలయాలకు కూడా మార్కెట్ రేటు ప్రకారమే ప్రభుత్వం భూములు కేటాయించి వుంది. ఎన్ని వార్తా సంస్థలు, ఎన్ని విద్యా, వ్యాపార సంస్థలు తమ సంస్థలను మూసేయలేదు. అవన్నీ భూములను తిరిగి ప్రభుత్వానికి అప్పగించాయా? అందరూ శుభ్రంగా అమ్మేసుకుని సొమ్ము చేసుకున్నారు. ఈ విషయంలో వాళ్ళకొక న్యాయం, నిప్పో యాజమాన్యానికి ఒక న్యాయమా? నిప్పో స్థలం ఇండస్ట్రియల్ జోన్‌లో వుంది. దానిని కన్వర్షన్ చేయడం, చేయకపోవడం అనేది ప్రభుత్వ ఇష్టం. కాని, మార్కెట్ రేటుపై కొన్న ఆ భూమిపై నిప్పో యాజమాన్యానికి హక్కు వుంటుంది. ఆరోజు ఎకరాకు 4,200 రూపాయలు మంచి రేటు. ఈరోజు కోట్లు పలుకుతుండబట్టే ఇన్ని వివాదాలొస్తున్నాయి. ఏ పదివేలో పాతికవేలో అయ్యుంటే దాని గురించి ఇంత రాద్ధాంతం వుండేది కాదు. రాష్ట్రంలో ఇలా కేటాయించిన భూములను ఎందరో అమ్ముకున్నారు. నెల్లూరులో ఒకప్పుడు స్పిన్నింగ్ మిల్లు వున్నటువంటి ప్రస్తుత రిత్విక్ లేఅవుట్‌ను ప్రభుత్వమే వేలం వేసి అమ్మగా ప్రస్తుతం టీడీపీ ఎంపీగా వున్న సీఎం రమేష్ కొని లేఅవుట్ చేయడం తెలిసిందే! ఆ లేఅవుట్‌లోనే ఇప్పుడు భారత ఉపరాష్ట్రపతి గారి నివాసం కూడా వుంది. ఇలా ఎన్నో ప్రభుత్వ భూములను ప్రభుత్వమే అమ్మేసుకుంది.

ప్రభుత్వం ఎవరికి భూములు కేటాయించినా నిబంధనలలో ప్రభుత్వానికి అవసరమైనప్పుడు ఆ భూమిని తిరిగి తీసుకునే విధంగా వ్రాసి వుంటారు. ప్రభుత్వానికి అవసరమంటే కొత్తరోడ్డు వేస్తుంటేనో, రైలు మార్గం వేస్తుంటేనో ప్రభుత్వ అవసరాలకు ఆ భూమిని స్వాధీనం చేసుకోవచ్చు. దీనికి ప్రభుత్వం నుండి నష్ట పరిహారం కూడా ఇవ్వాల్సి వుంటుంది. ఎందు కంటే ఉచితంగా ఇచ్చిన అసైన్డ్, సిజెఎఫ్ఎస్ భూములను ప్రభుత్వం అవసరంకొద్ది తీసుకుంటున్నప్పుడు ఆ భూములు సాగుచేస్తున్న రైతులకు నష్టపరిహారం ఇస్తున్నారు. అలాంటిది మార్కెట్ రేటు ప్రకారం కొన్న భూములకు నష్టపరిహారం వుండదా?

ప్రభుత్వ అవసరాల కోసం ఇప్పుడు నిప్పో భూములు తీసుకోవాలనుకోవడం లేదు. వాటి విలువ పెరిగింది కాబట్టే వివాదం చేస్తున్నారు. మరి ఈ భూమిపై నిప్పో యాజమానికి హక్కు లేనప్పుడు, వాళ్ళు ఫ్యాక్టరీ ప్రాంగణంలో సాయిబాబా గుడికి స్థలం ఇస్తే ఇప్పుడు వివాదం చేస్తున్న వాళ్ళందరూ ఎందుకు మౌనంగా వున్నారు.

నిప్పో ఫ్యాక్టరీ స్థలం ఎవరికి చెందుతుందన్నది నాయకులు నిర్ణయించేది కాదు, దీనిపై లోతుగా పరిశీలన జరిపితేనే పరిష్కారం దొరుకుతుంది. రాష్ట్రంలో భూములను తీసుకుని ఎత్తేసిన పరిశ్రమలు చాలావున్నాయి. వాళ్ళందరి నుండి ప్రభుత్వం భూములను తిరిగి తీసుకుందో, లేక వాళ్ళు అమ్ముకుని వెళ్ళారో... వివరాలు పూర్తిగా రాబడితే నిప్పో సమస్యకు కూడా అదే మార్గం వర్తిస్తుంది.

# నిరుపయోగంగా క్రీడా మైదానాలు



ప్రస్తుత కాలంలో చదువులు ఎలా నడుస్తున్నాయి.. అంతా కార్పొరేట్ విద్య. 50 అంకణాల స్థలంలో ఐదంతస్తుల భవనాలు... వాటిలో అగ్గిపెట్టెంత తరగతి గదులు... ఒక్కో గదిలో 50మందికి తగ్గకుండా విద్యార్థులు... ప్లేక్లాస్ నుండి టెన్త్ క్లాస్ దాకా చదువులు... ఇందులోనే మళ్ళీ సెక్షన్‌లు... 50అంకణాల స్థలం భవనానికే సరిపోకపోయే... ఇక క్రీడా మైదానమెక్కడ? బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్ కోర్టులు వేసేదెక్కడ?

కార్పొరేట్ చదువుల ముసుగులో బాల్యం పుస్తకాలకు, కంప్యూటర్ గేమ్స్‌కు పరిమితమైపోతుంది. విద్యార్థులకు బయట ఆటలతో సంబంధాలు తెగిపోతున్నాయి. వాలీబాల్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, సాఫ్ట్ బాల్, కబడ్డీ వంటి క్రీడలకు దూరమవుతున్నారు. ఆ క్రీడల గురించి వారికి తెలియడం లేదు. ఈ కాలం పిల్లలకు బాగా తెలిసిన ఆట అంటే క్రికెట్. అది కూడా టీవీలలో చూస్తుంటారు కాబట్టి. ఆటల వల్ల విద్యార్థుల్లో మానసిక వికాసం పెరుగుతుంది. మానవ సంబంధాలు మెరుగవుతాయి. తోటి క్రీడాకారులు స్నేహితులవుతారు. నేటి కార్పొరేట్ చదువుల మూలంగా విద్యార్థులు క్రీడా వికాసానికి దూరంగా బ్రతుకుతున్నారు. కంప్యూటర్ గేమ్స్‌తో కాలక్షేపం చేస్తున్నారు. తమ బెడ్‌రూంలో లాక్ చేసుకుని కంప్యూటర్లలో ఒంటరిగా గేమ్స్ ఆడుతుంటారు. ఆ గేమ్స్ కూడా ఇటీవలకాలంలో ప్రమాదకరంగా మారడం తెలిసిందే! కొందరు మానసిక ఉన్మాదులు తయారు చేస్తున్న గేమ్స్ పిల్లల మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతూ చివరికి వారిని ఆత్మహత్యలకు సైతం పురిగొల్పేలా చేస్తున్నాయి.

కార్పొరేట్ చదువులు రాకముందు ప్రభుత్వ, జడ్పీ ఇతర ఎయిడెడ్ పాఠశాలల్లో క్రీడలు, వ్యాయామం కొరకు ఖచ్చితంగా ఒక పిరియడ్ ఉండేది. ప్రతి స్కూల్‌కు ఒక పిఇటి ఉండేవాడు. ప్రతి హైస్కూల్, జూనియర్, డిగ్రీ కాలేజీలకు విశాలమైన క్రీడా మైదానాలుండేవి. విద్యార్థినీ విద్యార్థులందరి చేత గేమ్స్, స్పోర్ట్స్ ఆడించేవాళ్ళు. చదువులతో పాటు క్రీడలలోనూ విద్యార్థులను ప్రోత్సహించేవాళ్ళు. ఇప్పుడు కూడా ఆ క్రీడా మైదానాలున్నాయి. కాకపోతే అవి క్రీడలకు ఉపయోగపడడం లేదు. వివిధ మత సంస్థల కార్యక్రమాలకు, రాజకీయ సభలకు ఈ మైదానాలు ఉపయోగపడుతున్నాయి. జిల్లాలోని అన్ని జడ్పీ హైస్కూళ్లలో క్రీడా మైదానాలున్నాయి. కాని, ఆ స్కూళ్లలో విద్యార్థులే వుండడం లేదు. మార్కులు, చదువుల మోజులో క్రీడలపై ఆసక్తి తగ్గిపోతోంది. దాంతో క్రీడా మైదానాలు నిరుపయోగమవుతున్నాయి.

# ‘విపిఆర్ అమృతధార’

(5వ పేజీ తరువాయి)

నీటిని అందజేసేందుకు సంకల్పించి ‘విపిఆర్ అమృతధార’ పథకానికి రూపకల్పన చేయడం అందరికీ తెలిసిందే. నిత్యం తాగేందుకు మంచినీటి కోసం అలమటించే ప్రజలకు, ముఖ్యంగా ఫ్లోరిన్ బాధితులకు ‘విపిఆర్ అమృతధార’ పథకం..ఒక వరంగా మారిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఈ కార్యక్రమంలో భాగంగా మార్చి 31న విపిఆర్ అమృతధార 10వ విడత కార్యక్రమాన్ని వింజమూరు మండలంలోని నల్లగొండ్ల గ్రామంలో ప్రజలందరి సమక్షంలో ప్రారంభించారు. విపిఆర్ ట్రస్ట్ ద్వారా ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను విపిఆర్ స్వయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తొలుత విపిఆర్‌ను మేళతాళాలతో, భాజా భజంత్రీలతో ఎంతో ఆత్మీయతతో ఘనంగా స్వాగతించారు. వారందరి సమక్షంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన అనంతరం విపిఆర్ నల్లగొండ్లలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి విచ్చేయగా, ఆలయ అర్చకులు సత్యనారాయణాచార్యులు విపిఆర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ప్రజాసేవలోనే ఎంతో సంతృప్తి - విపిఆర్

ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో విపిఆర్ మాట్లాడుతూ, ఎంతోమంది తమకిష్టమైన మార్గాలను ఎంచుకుని జీవితాలు సాగిస్తుంటారని, తాను ప్రజాసేవా మార్గాన్ని ఎంచుకున్నానని, అదే తనకెంతో సంతృప్తినిస్తుందని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ ‘అమృతధార’ పథకం ద్వారా శుద్ధిచేసిన మంచినీటిని అందజేస్తూ జిల్లా ప్రజలకు సేవచేసే అవకాశం లభించడం తన అదృష్టమని ఆయన ఎంతో వినమ్రంగా అన్నారు. ఆయా గ్రామాల్లోని గ్రామపంచాయతీలు, మరియు ప్రజల అభ్యర్థనల మేరకు వారందరి సహకారంతోనే విజయవంతగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. దీనికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించడం తనకెంతో సంతోషం కలిగిస్తోందన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లావ్యాప్తంగా 100 వాటర్‌ప్లాంట్‌లను నెలకొల్పేందుకు ప్రణాళికలను రూపొందించామని ప్రజల హర్షధ్వానాల మధ్య విపిఆర్ ప్రకటించారు. ఈ వాటర్‌ప్లాంట్‌లను ప్రారంభించిన ప్రతిచోటా విద్యార్థులను ప్రోత్సహించేందుకు క్రికెట్ కిట్‌లు అందజేస్తున్నామన్నారు. గ్రామాల్లోని యువతను, వారి ప్రతిభను ప్రోత్సహించే సదుద్దేశంతో విపిఆర్ వికాస్ కార్యక్రమాన్ని రూపొందించి యువతకు క్రీడల్లో ప్రోత్సాహం ఇచ్చేందుకు వారికి క్రికెట్ కిట్‌లను, వాలీబాల్ కిట్‌లను ఉచితంగా ఇస్తున్నామన్నారు. క్రీడల్లో వారు రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిల్లో రాణించాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. జిల్లాలోని ప్రజలంతా విపిఆర్ ఫౌండేషన్ ద్వారా అమలవుతున్న ఈ కార్యక్రమాలను అందిపుచ్చుకుని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అంకినపల్లి ఓబుల్‌రెడ్డితో పాటు, స్థానిక సర్పంచ్ ఎల్.సరస్వతి, వింజమూరు సర్పంచ్ గణపం బాలకృష్ణారెడ్డి, వైఎస్సార్సీపి మండల కన్వీనర్ మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం, సీతారామపురం మండలంలోని మారంరెడ్డిపాళెంలో నూతనంగా నిర్మించిన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను విపిఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వాటర్‌ప్లాంట్ వద్ద ఆయన మొక్కలు నాటారు. మారంరెడ్డిపల్లి సర్పంచ్ ఆలూరు లక్ష్మీదేవి, శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆలూరి వెంకటసుబ్బయ్య తదితరులతో పాటు గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆ తర్వాత దుత్తలూరు మండలంలోని సోమలరేగడ గ్రామం, కొండాపురం మండలంలోని గొట్టిగుండాల గ్రామం, మర్రిపాడు మండలంలోని నెర్థనంపాడు గ్రామం, ఏఎస్ పేట మండలంలోని రాజోలు గ్రామాల్లో ఆయా గ్రామప్రజలు, గ్రామపెద్దల సమక్షంలో ‘విపిఆర్ అమృతధార’ పథకానికి (ఆర్‌ఓ మినరల్ వాటర్ ప్లాంట్స్‌కు) విపిఆర్ ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ప్రొఫెసర్ వి.నారాయణరెడ్డి, విపిఆర్ ఫౌండేషన్ చీఫ్ కో-ఆర్డినేటర్ ఎన్.శంకర్, సింహపురి హాస్పిటల్స్ అధినేత కె. రవీంద్రరెడ్డి, ఎ.శివశంకర్‌రెడ్డి, ఎం.రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయండి

**- జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు**



పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు సంబంధించి పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, 2017-18 ఆర్థిక సంవత్సరంలో నీరు-చెట్టు పథకానికి ప్రభుత్వం 40కోట్లు నిధులు కేటాయించిందన్నారు. ఈ పథకాన్ని ఏప్రిల్‌లో ప్రారంభించి సెప్టెంబర్‌లోపు పూర్తిచేయాలన్నారు. కనిగిరి రిజర్వాయర్‌లో పూడికతీత పనులను ప్రారంభించామని, రిజర్వాయర్‌లో మట్టిని రైతులు ఉచితంగా తీసుకువెళ్ళేందుకు అనుమతించాలన్నారు. ప్రైవేట్ వ్యక్తులు సీనరేజ్ చెల్లించి మట్టిని తీసుకువెళ్ళేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అటవీభూములు 1016, సి.ఏ భూములు, 1133హెక్టార్లు, డిజిపిఎస్ సర్వే పూర్తిచేసిన తర్వాత ఏపిపిసిసిఎస్ (గుంటూరు)కు అథెంటికేషన్ కోసం పంపాలన్నారు. ఫారెస్ట్ క్లియరెన్స్ పనులు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఈ నెల 12న సోమశిల ప్రాజెక్ట్, తెలుగు గంగ పరిధిలోని పెండింగ్ ప్రాజెక్టులపై రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డా.పి.నారాయణ తన క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహిస్తారని, ఈ సమావేశానికి అధికారులందరూ పూర్తి సమాచారంతో రావాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఇన్‌ఛార్జి జేసీ వెంకటసుబ్బారెడ్డి, డిఆర్‌ఓ వెంకటసుబ్బయ్య, ఓయస్‌డి పెంచలరెడ్డి, టిజిపి ప్రత్యేక కలెక్టర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.




జై సాయిరామ్ శ్రీ గణేశాయ నమః జై శ్రీరామ్

# శ్రీ షిరిడి సాయిబాబా మరియు శ్రీ యోగాంజనేయస్వామి వార్ల బ్రహ్మోత్సవ ఆహ్వానము

కొత్తూరు గ్రామం, ఇందుకూరుపేట మండలం, నెల్లూరు జిల్లా

స్వస్తిశ్రీ విళంబినామ సంవత్సరం ఉత్తరాయణం చైత్రమాసం కృష్ణ పక్షం సప్తమి శనివారం తేది 07-04-2018 నుండి ఏకాదశి బుధవారం తేది 11-04-2018 వరకు

## బ్రహ్మోత్సవ కార్యక్రమములు జరుగును

విశేష కార్యక్రమ వివరములు



తేది 08-04-2018 ఆదివారం ఉ|| గం|| 11-00 లకు
**శ్రీ సాయినాథునికి బ్రహ్మకలశాభిషేకం**

తేది 10-04-2018 మంగళవారం సా|| 5-00 నుండి
శ్రీ షిరిడి సాయినాథ, శ్రీరామ, శ్రీ ఆంజనేయ పరివారదేవతామూర్తుల
**రథోత్సవం**

తేది 11-04-2018 బుధవారం ఉ|| గం|| 11-00 లకు
**శ్రీ యోగాంజనేయ స్వామివారికి బ్రహ్మకలశాభిషేకం**



ఈ విధముగా జరుగు కార్యక్రమములకు బంధుమిత్ర సమేతంగా విచ్చేసి
శ్రీ షిరిడి సాయిబాబా మరియు శ్రీ యోగాంజనేయస్వామి వార్ల తీర్థప్రసాదములు స్వీకరించి, స్వామి వార్ల కృపాకటాక్షములకు పాత్రులు కావలసినదిగా కోరడమైనది.

గమనిక : అన్నప్రసాద వితరణ 07-04-2018 నుండి 11-04-2018 వరకు, ప్రతి రోజు మధ్యాహ్నం 12-00 గం||ల నుండి ప్రారంభం.

ఆహ్వానించువారు : శ్రీమతి కలికి శ్రీలత - శ్రీ కలికి కోదండరామిరెడ్డి, దర్మకర్తలు

---



# హృదయాభినందనలు

దాతృత్వమే పరమావధిగా
నిరంతర సేవే తన విధిగా
పేదల పాలిట పెన్నిధిగా
సేవా రంగానికే ప్రతినిధిగా

మానవతా పరిమళాలను వెదజల్లుతూ
నేడు రాజ్యసభ సభ్యునిగా బాధ్యతలు చేపట్టిన

మా పెద్దాయన
**వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గారికి**
హృదయాభినందనలు.

అనపల్లి సుప్రియ వినోద్
సుప్రియ అసోసియేట్స్
నెల్లూరు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com